PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 151 | విజయవాడ, బుధవారం 3 జనవరి 2024 | 6 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 3 January 2024 | Rs



రెండు విమానాలు ఢీ

- ఐదుగురు మృతి
- టోక్యో విమానాశ్రయంలో ఘోరం

5

వన్డేల్లో వైట్‌వాష్...



- ఆసీస్ మహిళల చేతిలో 190 పరుగుల తేడాతో ఓటమి
- లిచ్‌ఫీల్డ్ సెంచరీ
- సిరీస్ 3-0తో ఆస్ట్రేలియా కైవసం

లోపలి పేజీలో..

లోటు రూ.లక్ష కోట్లు

సతమతమవుతున్న ఆర్థికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సొంత ఆదాయం కన్నా మొత్తం వ్యయం భారీగా నమోదవుతుండడంతో రాష్ట్ర ఖజానాపై భారీ లోటు పడుతోంది. తొలి మూడు త్రైమాసికల్లో (డిసెంబరు వరకు) ఏకంగా రూ.లక్ష కోట్లకుపైగా లోటు రికార్డయింది. దీంతో కేంద్రం నుంచి వచ్చే కొద్దిపాటి నిధులతోపాటు, భారీగా సేకరిస్తున్న రుణాలతోనే కాలాన్ని నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇంత చేస్తున్నా నెల ఆరంభంలో వేతనాలు, పింఛన్లకు తీవ్ర ఇబ్బందులు నెలకొంటుండడంతో ఓవర్‌డ్రాఫ్ట్‌ను కూడా ఆశ్రయించాల్సి వస్తోందని ఆర్థికశాఖ అధికారులు వాపోతున్నారు.

తాజాగా వెలుగుచూసిన లెక్కలు మేరకు సొంత ఆదాయం, మొత్తం వ్యయంలో తొలి తొమ్మిది నెలల్లో రూ.1,05,412 కోట్లు లోటుగా తేలింది. రాష్ట్ర సొంత పన్నులు, ఇతర సొంత ఆదాయం రూ.60,626 కోట్లు మాత్రమే రికార్డు కాగా, వ్యయం మాత్రం ఏకంగా రూ.1,66,040 కోట్లుగా రికార్డు కావడంతో ఈ భారీ లోటు నెలకొందని అధికారులు చెబుతున్నారు. వ్యయాన్ని పరిశీలిస్తే మే నెల్లోనే రూ.26,576 కోట్లు ఖర్చు చేయగా, జూన్‌లో రూ.24,913 కోట్లు, ఏప్రిల్‌లో రూ.20,320 కోట్లు ఖర్చు చేసినట్లు తేలింది. ఆదాయ విభాగంలో జులై, సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్ నెలల్లో తక్కువగా ఆదాయం వచ్చినట్లు తేలింది. దైనందిక అవసరాలు తీర్చుకునేందుకు కావాల్సిన ఆదాయం రాకపోవడంతో ఎక్కువగా ఓవర్‌డ్రాఫ్ట్‌లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గత నాలుగు నెలలుగా నెల ఆరంభం నుంచి నెలాఖరు వరకు కూడా మధ్యమధ్యలో ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

నెలవారీ ఆదాయ వ్యయాల వివరాలు (రూ.కోట్లలో)

నెల	ఆదాయం	వ్యయం	లోటు
ఏప్రిల్	8,147	20,320	12,173
మే	6,386	26,576	20,190
జూన్	6,826	24,913	18,087
జులై	5,579	18,989	13,410
ఆగస్టు	6,299	15,515	9,215
సెప్టెంబర్	5,938	14,902	8,965
అక్టోబర్	5,491	14,578	9,086
నవంబర్	10,032	17,073	7,040
డిసెంబర్	5,928	13,174	7,246
మొత్తం	60,626	1,66,040	1,05,412

గ్రామీణ ఉపాధి హామీపై దాడి!

- ఆధార్ నిబంధనపై సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో విమర్శ

న్యూఢిల్లీ : గ్రామీణ ఉపాధి హామీకి ఆధార్‌ను తప్పనిసరి చేయడమంటే గ్రామీణ ఉపాధి హామీపై నేరుగా దాడి చేయడమేనని సిపిఐ(ఎం) విమర్శించింది. పార్టీ పొలిట్‌బ్యూరో మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల జేసింది. డిమాండ్ ప్రాతిపదికన గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా) పట్ల మోడీ ప్రభుత్వం ఎంత శత్రుపూరితంగా వ్యవహరిస్తున్నదీ తాజా చర్య తేటతెల్లం చేస్తోందని పేర్కొంది. ఇది కోట్లాదిమంది కార్మికుల ఉపాధి హక్కును లాగేసుకోవడమేనని వ్యాఖ్యానించింది. ఆధార్ ప్రాతిపదిక చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్)కు గడువు డిసెంబరు 31తో ముగిసింది. ఈ చట్టం కింద ప్రతి గ్రామీణ కార్మికునికి జాబ్ కార్డు పొందే హక్కు వుంటుంది. జాబ్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించాల్సి వుంటుంది.

జాబ్ కార్డు కలిగినవారిలో అర్హులైన వారు, అర్హులు కాని వారు అంటూ కేంద్ర ప్రభుత్వం విభజన తీసుకురావడం ఈ చట్ట తొట్టతొలి ఉల్లంఘనగా పొలిట్‌బ్యూరో పేర్కొంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం, పేరు నమోదు చేసుకున్న 25.25 కోట్ల మంది కార్మికుల్లో కేవలం 14.35కోట్ల మంది మాత్రమే అర్హులు. నరేగా వెబ్‌సైట్ ప్రకారం గత మూడేళ్లలో కనీసం ఒక రోజు అయినా పని చేసి ఉంటేనే అర్హులు. జాబ్ కార్డు కలిగి ఉండి తనకు పని అవసరం లేదని అనుకున్నా లేదా ఇదివరకు ఆమె పనిచేయకుండా ఉండి ఇప్పుడు పనిచేయాలని నిర్ణయించుకున్నట్లైతే, అమెకు పని దొరకదు. ఎందుకంటే అటువంటి వారిని అనర్హులని ఎంఎన్ఆర్ఇజిఎ సైట్ ప్రకటించేసింది. మరో మాటలో చెప్పాలంటే, చట్ట ప్రకారం జాబ్ కార్డు పొందేందుకు అర్హులైన 10కోట్ల మందికి పైగా కార్మికులను అనర్హులుగా ప్రకటించేశారన్న మాట. ఎబిపిఎస్ పొందేందుకు ఈ విధంగా అనర్హత వేటు పడినవారికి మిగతా 2లో

సమాన పనికి సమాన వేతనం ఇవ్వం

ప్రభుత్వ ప్రకటనతో మున్సిపల్ చర్చలు విఫలం

- సమ్మె కొనసాగుతుంది : సిఐటియు అనుబంధ సంఘం
- నేటి నుండి అదే బాటలోకి ఎఐటియుసి, మున్సిపల్ జెఎసి



చర్చలు అనంతరం బయటకు వస్తున్న సిఐటియు, తదితర కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'సమాన పనికి -సమాన వేతనం పాతిపదికగా న్యాయం చేస్తాం..' అని మ్యానిఫెస్టోలో అట్టహాసంగా పేర్కొన్న వైసిపి ప్రభుత్వం తాజాగా మాట మార్చింది. సమాన పనికి సమాన వేతనం ఇచ్చేది లేదని తెగేసి చెప్పింది. అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచేది లేదని స్పష్టం చేసింది. మున్సిపల్ కార్మికుల సమ్మె తీవ్రమౌతున్న నేపథ్యంలో కార్మికసంఘాలతో మంగళవారం నిర్వహించిన చర్చల్లో మంత్రుల కమిటీ ఈ మేరకు ప్రకటించింది. 'సమాన పనికి సమాన వేతనం ఇవ్వడమన్నది సాధ్యమే కాదు' అని మంత్రుల కమిటీ వ్యాఖ్యానించింది. ప్రభుత్వం వ్యవహరించిన ఈ తీరుతో చర్చలు విఫలమైనాయి. సమ్మె యథావిధిగా కొనసాగుతుందనిఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రకటించింది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా తాము కూడా నేటి (బుధవారం)నుండి సమ్మెను ప్రారంభించనున్నట్లు ఎఐటియుసి, మున్సిపల్ జెఎసిలు ప్రకటించాయి. తొలుత ఉదయం 11 గంటలకు సమావేశం ఉందని నాయకులకు సమాచారం పంపిన ప్రభుత్వం మధ్యాహ్నం 1:30 గంటలకు చర్చలు ప్రారంభించింది. రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో తొలుత తాము సానుకూలంగా ఉన్నామని, మీ డిమాండ్లపై సిఎంతో మాట్లాడి చెబుతామని మంత్రులు మున్సిపల్ సంఘాల నాయకులకు చెప్పారు.. అరగంట తరువాత మరలా ప్రారంభమైన చర్చల్లో సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం సాధ్యం కాదని, వెంటనే సమ్మె విరమించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని మంత్రుల బృందం హెచ్చరించి అర్థాంతరంగా చర్చలు ముగించేసింది. దీంతో సమ్మెను కొనసాగిస్తామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు ప్రకటించారు. ప్రభుత్వం మోసం చేసిందని, తాము కూడా బుధవారం నుండి సమ్మెలోకి వెళుతున్నామని ఎఐటియుసి, మున్సిపల్ జెఎసి, స్వతంత్ర సంఘాల నాయకులు ప్రకటించారు. ప్రభుత్వ వైఖరి కారణంగా అనివార్యంగా సమ్మెలోకి వెళుతున్నామని జెఎసి నాయకులు సుబ్బారాయుడు ప్రకటించారు. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, టిఎన్‌టియుసి సంఘాలు కూడా సమ్మెలోకి దిగుతున్నట్లు ప్రకటించాయి. గుంటూరు స్వతంత్ర సంఘాల నాయకులు మధుబాబు కూడా తాము సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం తరపున సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఉద్యోగ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, డిఎంఇ కోటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడు, ఆప్కాస్ ఎమ్‌డి వాసుదేవరావు హాజరయ్యారు. మున్సిపల్ కార్మిక సంఘాల తరపున ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు నాగభూషణం, నాయకులు మిగతా 2లో

ప్రజా హక్కులను కాలరాసే న్యాయ సంస్కరణలు చెల్లవు



- ఇజ్రాయిలీ సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు
- నెతన్యాహుకు గట్టి ఎదురుదెబ్బ

లోపలి పేజీలో..

నోటీసులు, ముందస్తు అరెస్టులు

- 5వ తేదీలోగా విధుల్లో చేరాలంటూ అధికారుల హుకుం
- భగ్గుమన్న అంగన్‌వాడీలు
- ఎక్కడికక్కడ నోటీసులు దహనం



విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నోటీసులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం తలపెట్టిన కలెక్టరేట్ల వద్ద బైటాయింపు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి అధికారులు పలు జిల్లాల్లో అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చింది. ఈ నెల 5వ తేదీలోగా విధుల్లోకి చేరకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామంటూ ఈ నోటీసుల్లో హెచ్చరించారు. దీంతో, అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. ఈ నోటీసులను తగులబెట్టి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. నోటీసులను తీసుకోవడానికి పలువురు తిరస్కరించారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించకపోగా నోటీసులు ఇవ్వడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ముందస్తు అరెస్టుకు పోలీసులు పాల్పడ్డారు. అంగన్‌వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి శ్రీదేవిని మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి మడకశిర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న అంగన్‌వాడీలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. శాంతియుతంగా తాము నిరసన తెలుపుతుంటే ఇలా అరెస్టులు చేయడం ఏమిటని ఎస్ఐని నిలదీశారు. పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పోలీసు స్టేషన్‌కు తరలిరావడంతో శ్రీదేవిని విడిచిపెట్టారు. ఈ నెల 5వ తేదీలోగా విధుల్లోకి చేరకపోతే చర్యలు మిగతా 2లో

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా 9 నుంచి ర్యాలీలు, సభలు

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు

లోపలి పేజీలో..

వైసిపి రెండో జాబితా విడుదల

- మూడు పార్లమెంటు, 24 అసెంబ్లీలకు ఇన్‌చార్జీలు
- గోరంట్ల మాధవ్‌కు నో
- ఇద్దరు మంత్రులకు స్థానచలనం



ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన బిజెపి మాజీ ఎంపి జె శాంత వార్త 2లో..

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి 2024 ఎన్నికలకు నియోజకవర్గ ఇన్‌చార్జీల రెండో విడత జాబితాను ప్రకటించింది. మూడు పార్లమెంటు స్థానాలకు, 24 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను మారుస్తూ.. మంగళవారం ఆ పార్టీ ప్రకటన చేసింది. ఈ మేరకు మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జాబితాను ప్రకటించారు. మంత్రులు కెవి ఉషశ్రీ చరణ్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు స్థానచలనం చేశారు. అలాగే ముగ్గురు ఎంపిలు మార్గాని భరత్, వంగా గీత, తలారి రంగయ్య, గొడ్డేటి మాధవిని అసెంబ్లీలకు పంపారు. ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పేర్ని నాని, భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ తమ వారసులకు స్థానాలు ఇప్పించుకున్నారు. అనంతపురం పార్లమెంటుకు మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, హిందూపురానికి జె శాంత, అరకు పార్లమెంటుకు కె భాగ్యలక్ష్మిని ఇన్‌ఛార్జులుగా ప్రకటించారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రాజాం నియోజకవర్గానికి టి రాజేష్, అనకాపల్లికి ఎం భరత్‌కుమార్, పాయకరావుపేటకు కంబాల జోగులు, రామచంద్రాపురానికి పిల్లి సూర్యప్రకాష్, పి గన్నవరం నియోజకవర్గానికి వి వేణుగోపాల్, పీఠాపురం వంగా గీత, జగ్గంపేట తోట నరసింహం, ప్రత్తిపాడుకు పరుపుల సుబ్బారావు, రాజమండ్రి సిటికి మార్గాని భరత్, రాజమండ్రి రూరల్‌కు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పోలవరం నియోజకవర్గానికి తెల్లం రాజ్యలక్ష్మి, కదిరికి బిఎస్ మగ్బూల్ అహ్మద్, ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి టి చంద్రశేఖర్, ఎమ్మిగనూర్‌కు మాచాని వెంకటేష్, తిరుపతికి భూమన అభినయ్‌రెడ్డి, గుంటూరు ఈస్ట్‌కు షేక్ నూరి ఫాతిమ, మచిలీపట్నం నియోజకవర్గానికి పేర్ని కృష్ణమూర్తి, చంద్రగిరికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పెనుగొండకు మంత్రి ఉషశ్రీ చరణ్, కళ్యాణదుర్గం నియోజకవర్గానికి తలారి రంగయ్య, అరకుకు గొడ్డేటి మాధవి, పాడేరుకు ఎం విశ్వేశ్వరరాజు, విజయవాడ సెంట్రల్‌కు వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ వెస్ట్‌కు షేక్ ఆసిఫ్‌లను ప్రకటించారు.

యుపిలో మహిళలపై నేరాలు అధికం

- ఏకంగా 55 శాతం నేరాలు
- వేధింపుల కేసులే అధికం
- జాతీయ మహిళా కమిషన్ వెల్లడి

లోపలి పేజీలో..



'రా.. కదలిరా' పేరుతో జనంలోకి చంద్రబాబు

- కనిగిరిలో 5న తొలి బహిరంగ సభ
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

కాంగ్రెస్‌తో కలిసి నడుస్తా

- నేడు ఢిల్లీకి వెళ్తా : వైఎస్ షర్మిల



ఇడుపులపాయలో వైఎస్ఆర్ స్మారకం వద్ద తల్లి విజయమ్మతో కలిసి తండ్రికి నివాళులర్పిస్తున్న షర్మిల

ప్రజాశక్తి- వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా), హైదరాబాద్ బ్యూరో

దేశంలో అతి పెద్ద సెక్యులర్ పార్టీ కాంగ్రెస్‌తో కలిసి నడవాలని నిర్ణయించుకున్నట్లు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు షర్మిల తెలిపారు. తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహం సందర్భంగా మొదటి శుభలేఖను ఆమె ఇడుపులపాయలోని మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి సమాధి ముందు ఉంచారు. కుటుంబసభ్యులతో కలిసి ప్రార్థన నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి ఆశీస్సుల కోసం వచ్చినట్లు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ మద్దతు ఇచ్చిందని, ఆ పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషించిందని చెప్పారు. ఆ కృతజ్ఞతా భావంతో కాంగ్రెస్ పార్టీ తనను ఆహ్వానించిందని చెప్పారు. కాంగ్రెసుతో కలిసి పనిచేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరమూ లేదని అన్నారు. నేడు (బుధవారం) ఢిల్లీకి వెడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో షర్మిల పాత్ర గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె జవాబిస్తూ ఒకటి,రెండు రోజుల్లో అందరి ప్రశ్నలకు, అన్ని ప్రశ్నలకు జవాబు దొరుకుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో షర్మిల తల్లి వైఎస్.విజయమ్మ, కుమారుడు రాజారెడ్డి, కుమార్తె అంజలి, కాబోయే కోడలు అట్లూరి ప్రియా, వియ్యంకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నాయకులతో సమావేశం

అంతకుముందు హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నాయకులతో షర్మిల సమావేశమయ్యారు. కాంగ్రెస్‌లో వైఎస్ఆర్‌టిపి విలీనం తదితర అంశాలపై షర్మిల చర్చించారు. రాజకీయ భవిష్యత్తు కోసం నాయకులెవరూ ఆందోళనపడవద్దని, తగిన న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం మీడియాతో షర్మిల మాట్లాడుతూ అన్ని అంశాలపై రెండు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. తనతో కలిసి నడుస్తానన్న మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే వ్యాఖ్యలపై స్పందిస్తూ.., ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్ఆర్‌టిపి ప్రధాన కార్యదర్శి తూడి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ షర్మిలకు ఎఐసిసిలో కీలక పదవి దక్కే అవకాశం ఉందని చెప్పారు.

మాజీ మంత్రి దాడి వైసిపికి రాజీనామా

- నేడు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- అనకాపల్లి



మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు రత్నాకర్, జైవీర్... వైసిపికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరభద్రరావు మాట్లాడారు. రాజీనామా లేఖను వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి పంపినట్టు తెలిపారు. తాను 2019 ఎన్నికల ముందు వైసిపిలో చేరానని, అప్పట్లో తన కుమారుడు రత్నాకర్‌కు సీటు వస్తుందని భావించానని అన్నారు. గుడివాడ అమర్‌నాథ్‌కు సీటు రావడంతో తన కుటుంబం మొత్తం ఆయన విజయానికి కృషి చేసిందని వివరించారు. ఇటీవల పరిణామాల నేపథ్యంలో 2024 ఎన్నికల్లోనూ తమకు పార్టీ సీటిస్తుందన్న భరోసా లేకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యామన్నారు. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్‌తో చర్చలు జరిపినట్టు తెలిపారు. బుధవారం వారి సమక్షంలో టిడిపిలో చేరుతానన్నారు.

హిందుస్తాన్ షిప్‌యార్డు కాంట్రాక్టుకు గండి?

- అడ్డదారిలో ఎంట్రీకి ఎల్అండ్‌టి యత్నం



విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) కొద్ది నెలల క్రితం రూ.19 వేల కోట్ల ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల ఆర్డర్ దక్కించుకున్నా, తాజాగా కేంద్రం మరో ప్రయివేట్ కంపెనీ టెండరుకు మార్గం సుగమం చేసినట్లు సమాచారం. దీంతో, హిందుస్తాన్ షిప్‌యార్డు అధికార, ఉద్యోగ వర్గాల్లో సదరు ప్రయివేట్ కంపెనీ ప్రవేశంపై తీవ్ర ఆందోళన మొదలైంది. పైన తెలిపిన కాంట్రాక్టులో సగానికిపైగా ప్రయివేట్ కంపెనీ కొట్టేస్తే షిప్‌యార్డు ఆదాయానికి తీవ్ర గండిపడి మనుగడే ప్రమాదంలో పడనుంది. ఈ కాంట్రాక్టు షిప్‌యార్డుకు రాకుండా కేంద్రం ఏదో ఒక మెలిక పెడుతూ ఎల్అండ్‌టిని రంగప్రవేశం చేయించే పనిలో ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. నేరుగా షిప్‌యార్డుకు ఇవ్వొద్దని కేంద్రంపై ఎల్అండ్‌టి అప్పట్లో ఒత్తిడి తెచ్చింది. వాస్తవానికి 2010లోనే షిప్‌యార్డుకు దక్కాల్సిన రూ.వేల కోట్ల కాంట్రాక్టు ఇది. షిప్‌యార్డును ఇండియన్ నేవీకి అవసరమైన యుద్ధనౌకల తయారీకి సిద్ధం చేసే క్రమంలో నేవీలో విలీనం చేసినప్పటిది ఈ ఆర్డర్. కానీ, 2014లో కేంద్రంలో బిజెపి సర్కారు వచ్చినప్పటి నుంచీ ఈ ఎఫ్ఎస్ఎస్‌ల కాంట్రాక్టును పెండింగులో పెట్టేసింది. కొన్నాళ్లపాటు ఎల్అండ్‌టి సంస్థ అయితే చేయగలదని షిప్‌యార్డుకు ఉద్దేశపూర్వకంగానే కేంద్రం ఈ కాంట్రాక్టును దక్కకుండా చేసింది. అయితే, నౌకా నిర్మాణ రంగంలో ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్న హిందుస్థాన్ షిప్‌యార్డు 2022 ఆగస్టులో ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ నేపథ్యంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్ల మేర టర్నోవర్ గ్యారెంటీ అంటూ ఆ సంస్థ సిఎండి హేమంత్ ఖత్రీ ఆ సందర్భంగా ప్రకటించారు.

అంతలోనే ఏం జరిగింది?

కేంద్రం తాజా వాదనలు చూస్తే ఆశ్చర్య పడాల్సిందే. రూ.వేల కోట్ల కాంట్రాక్టు చేసేందుకు షిప్‌యార్డులో అధునాతన మౌలిక సదుపాయాలు లేవని, ప్రాథమిక పెట్టుబడి లేనందున కనీసం రెండు ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)లను ఎల్అండ్‌టి సంస్థకు కాంట్రాక్టులో భాగం చేయాలని పైనుంచి షిప్‌యార్డు అధికారులపై ఒత్తిడి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో హిందుస్థాన్ షిప్‌యార్డు అధికారుల్లో తాజాగా తర్జనభర్జన సాగుతోంది. ఎల్అండ్‌టికి ఎంట్రీ ఇస్తే షిప్‌యార్డుకు మనుగడ ఉండదని కేంద్రానికి తెలియజేసినట్లు సమాచారం.

షిప్ బిల్డింగ్‌కు ఆస్కారం లేదా?

విశాఖపట్నం షిప్‌యార్డులో నాలుగు స్లిప్ వేలు ఉన్నాయి. ఇవి నౌక తయారైన తర్వాత నీటిలోకి జారిపోయే యంత్ర పరికరాల వ్యవస్థ. ప్రస్తుతం రెండు సిద్ధంగా ఉన్నాయి. చాలా వరకూ ఈ స్లిప్‌వేలలో ఎక్విప్‌మెంట్ సక్రమంగా లేదు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్ గ్రేడేషన్ ఈ కాలంలో జరగలేదన్నది అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ఈ సాకుతో కేంద్రం ఎల్అండ్‌టిని రంగంలోకి దించేయడం సరైంది కాదని వారంటున్నారు. గడిచిన పదేళ్లలో షిప్‌యార్డుకు సరైన ఆర్డర్లు లేనందున స్లిప్ వేల దగ్గర ఇన్‌ఫ్రా సమకూర్చులేకపోయామని, బ్యాంకు నుంచి రుణానికి అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని వేడుకున్నా నిరాకరించిందని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. ఐదు ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణ ఆర్డర్ కాంట్రాక్టు అంతా ఇండియన్ నేవీదే. ఈ కాంట్రాక్టు షిప్‌యార్డుకు దక్కిన రోజు నుంచే కాంట్రాక్టు అమల్లో ఉంటుంది. అంటే, రెండేళ్లలో మొదటి షిప్ నిర్మించి ఇవ్వాలి. ఆ తర్వాత ప్రతి ఎనిమిది నెలలకూ మిగతా 2లో

వైసిపిలో చేరిన బళ్లారి మాజీ ఎంపి జె శాంత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్ణాటకలోని బళ్లారి మాజీ ఎంపి, బిజెపి నాయకులు జె శాంత వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం ఆమె పార్టీ కండువా కప్పుకుని వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపి పి మిథున్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె శాంత మాట్లాడుతూ.. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపిలో చేరినట్లు తెలిపారు. జగన్ ఏ బాధ్యతలు అప్పగించినా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకలో బిజెపి ప్రభుత్వంలో కీలక నాయకులు, గాలి జనార్ధన్‌రెడ్డి సహచరుడు అయిన మాజీ మంత్రి శ్రీరాములుకు జె శాంత సోదరి. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన జె శాంతను హిందూపురం పార్లమెంటు నుంచి పోటీ చేయించేందుకు పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిసింది.

విశాఖకు క్యాంపు కార్యాలయాల తరలింపు కేసు

- విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ రఘునందన్‌రావు

ప్రజాశక్తి-అమరావతి

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సమీక్షల నిమిత్తం విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటు చేయాలన్న కేసులో ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ రఘునందన్‌రావు తప్పుకున్నారు. ఈ విషయంపై అప్పీల్‌ను ఏ బెంచ్ విచారణ చేపట్టాలో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పరిపాలన పరమైన నిర్ణయం తీసుకోవాల్సి వుంది. క్యాంపు కార్యాలయాల ఏర్పాటు జిఓను బెంచ్ విచారణ చేపట్టే వరకు సస్పెండ్ చేస్తూ సింగిల్ జడ్జి గతంలో మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీ ల్‌పై మరో ధర్మాసనం సత్వరమే విచారణ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. వెంటనే చర్యలు తీసుకుంటామని సిజె హామీ ఇచ్చారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హిందుస్తాన్ షిప్‌యార్డు కాంట్రాక్టుకు గండి?

(మొదటి పేజీ తరువాయి)

ఒక నౌకను ఇచ్చేయాలి. ఇలా ఏడేళ్లలో ఐదు ఎఫ్ఎస్ఎస్‌లు తయారు చేసి ఇవ్వాలి.

తగ్గిపోయిన వర్క్‌మెన్!

దేశంలోనే తొలి నౌకానిర్మాణ కేంద్రం 1941 జూన్‌లో విశాఖలో హెచ్ఎస్ఎల్‌గా ఏర్పాటైంది. 2010 వరకూ ఏడు వేల మంది మ్యాన్‌పవర్ (స్టాఫ్, వర్క్‌మెన కలిపి) ఉండేది. నేడు పర్మినెంట్ వర్కర్లు 370 మందే ఉన్నారు. నైపుణ్యంగల వారిలో ఎక్కువమంది రిటైరైపోయారు. షిప్‌యార్డులో అవుట్ సోర్సింగ్ మ్యాన్‌పవర్ 2000 ప్రస్తుతం ఉన్నా, నైపుణ్యంగల పనులు చేయలేరని అంటున్నారు. ఈ నేపథ్యంలో షిప్‌యార్డు యాజమాన్యం కూడా ఎల్‌అండ్‌టి అడ్డదారిలో ప్రవేశిస్తున్నా గట్టిగా వ్యతిరేకించకుండా మెత్తబడిందన్న చర్చ జరుగుతోంది. తొలుత రెండు ఎఫ్ఎస్ఎస్‌లతో ఎల్‌అండ్‌టి మొదలుపెట్టి మొత్తం ఐదు ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణం లాగేసుకుంటుందన్న అనుమానాలు తాజాగా వ్యక్తమవుతున్నాయి.

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా 9నుంచి ర్యాలీలు, సభలు

సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు



సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ నరసింగరావు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా ఈ నెల 9 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, సభలు నిర్వహించనున్నట్లు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ప్రకటించాయి. ఈ మేరకు మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్లో విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కె పొలారి మాట్లాడారు. అంగన్‌వాడీలు 21 రోజుల నుండి సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని తెలిపారు. 30 లక్షల మంది లబ్ధిదారులు కూడా వారికి మద్దతు ఇస్తున్నారని, అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో వారికి మద్దతుగా కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. సమ్మెను అణచేందుకు అనేక ప్రయత్నాలు చేశారని, అయినా మహిళలు లొంగలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలకు పోకుండా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు అన్నారు. ఇప్పటికే ఉద్యోగులు సమ్మెలో ఉన్నారని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

'రా.. కదలిరా..!'

5నుంచి జనంలోకి చంద్రబాబు

- కనిగిరిలో తొలి బహిరంగ సభ
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'రా.. కదలిరా' పేరుతో ఈ నెల 5 నుంచి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రజల్లోకి వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్, రూట్ మ్యాప్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 22 భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 5న తొలి బహిరంగసభ ప్రకాశం జిల్లా కనిగిరిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టిడిపి, జనసేన సంయుక్తంగా నిర్వహించే సభలకు చంద్రబాబుతోపాటు కొన్ని సభలకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా హాజరవుతారని తెలిపారు. ఈ నెల 3న మంగళగిరిలోని పార్టీ కార్యాలయం సమీపంలోని సి కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ విభాగం సదస్సు, 4న పార్టీ కార్యాలయంలో చంద్రబాబు చేతులమీదుగా 'జయహో బిసి' సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టిడిపిలో చేరికలకు సంబంధించి రెండు కమిటీలు వేశామన్నారు. టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో బస్సుయాత్ర ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యాత్రకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. మీడియా సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు పాల్గొన్నారు.

సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్యపరచాలి

- ప్రజాశక్తి సాహితీ సంస్థ పూర్వ జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య



'జీవన స్పర్శ' ఆవిష్కరణలో వి.కృష్ణయ్య, కె.ఉషారాణి, వొరప్రసాద్, గానారా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సమాజంలో జరుగుతున్న మార్పులను విశ్లేషిస్తూ మంచి సాహిత్యాన్ని అందించడం ద్వారా ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత రచయితలపై ఉందని ప్రజాశక్తి సాహితీ సంస్థ పూర్వ జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య అన్నారు. విజయవాడలో జరుగుతున్న 34వ పుస్తకమహోత్సవంలో కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై గనారా రచించి, సాహితీ స్రవంతి ప్రచురించిన 'జీవన స్పర్శ' నవలను కృష్ణయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్య తరగతి కుటుంబ ఘర్షణ, జీవన పోరాటాన్ని విపులంగా గనారా రాశారని అన్నారు. వామపక్ష ఉద్యమాలు, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు వంటి అంశాల గురించి విస్తృతంగా చర్చించారని తెలిపారు. రచయిత్రి, ప్రజాశక్తి బుక్‌హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి.. ఈ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ప్రేమకథ నేపథ్యంలో సామాజిక మార్పులను, సంఘర్షణలను చక్కగా చిత్రీకరించారని వివరించారు. ఆధునిక జీవితంలో సాహిత్యానికి స్థానం తగ్గిపోవడం విచారకరమని సభకు అధ్యక్షత వహించిన వొరప్రసాద్ అభిప్రాయపడ్డారు. సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ మాట్లాడుతూ.. ఒక మనిషి వ్యక్తిగత, ఉద్యోగ, సామాజిక జీవితానికీ మధ్య జరిగే సంఘర్షణను రచయిత హృద్యంగా చిత్రీకరించారని తెలిపారు. రచయిత గానారా మాట్లాడుతూ.. తాను మధ్య తరగతి వ్యక్తినని, చిన్నప్పటి నుండి మధ్య తరగతి వారి అనుబంధం, జీవన విధానాల గురించి పరిశీలించానని తెలిపారు. వారి జీవన స్థితిగతుల గురించి ఈ నవలలో వివరించానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు కె.సత్య రంజన్ పాల్గొన్నారు.

షర్మిలతో నష్టం లేదు: వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరినా వైసిపికి ఎలాంటి నష్టం లేదని వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ ఎంపి వైవి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కోసం షర్మిలను కలిసినట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని అన్నారు. అప్పుడప్పుడు విజయమ్మను కలిసి కుటుంబ విషయాలు మాట్లాడుతాను తప్ప రాజకీయాలు మాట్లాడను అని అన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు షర్మిల వైపు వెళ్తున్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వ్యక్తిగత కారణాలతో కొందరు పార్టీలు మారుతున్నారని, అందులో మంగళగిరి ఎమ్మెల్యే ఆర్‌కె వున్నారని పేర్కొన్నారు. అనకాపల్లిలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఓపిక లేకుండా దాడి వీరభద్రరావు పార్టీని వీడారని అన్నారు.

వైసిపి ముఠా తగదాల వల్లే దాడి : టిడిపి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపిలోని ముఠా తగదాలను తప్పుదోవ పట్టించేందుకే మంత్రి విడదల రజిని తన కార్యాలయంపై టిడిపి కార్యకర్తలు దాడి చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నారని టిడిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శించారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఒక సెక్యూరిటీ సిబ్బంది అర్ధరాత్రి 2 గంటలకు ఫిర్యాదు చేస్తే మూడు గంటల కల్లా 30 మంది నిందితుల వివరాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైసిపి కార్యాలయం ప్రారంభానికి హైదరాబాద్ నుంచి అంబర్‌పేట శంకర్ అనే రౌడీషీటర్ వచ్చి ఉండడంపై అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. డిసెంబర్ 31న జరిగిన ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు మొండి వైఖరి సరికాదు


- అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని దీక్షలు : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా, సమగ్రశిక్షా, మున్సిపల్ వర్కర్లు, వలంటీర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సమస్యలకు పరిష్కారం చూపకుండా మొండి వైఖరి ప్రదర్శించడం సరైందికాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. తక్షణం వారితో చర్చలు జరిపి ఆందోళనలను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయనందునే వారు సమ్మెలోకి పోయారని తెలిపారు. బైజూస్‌లో రూ.9,800 కోట్ల మనీలాండరింగ్ వుందన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రానికి భయపడిపోతున్నాయని విమర్శించారు. నిధుల విషయంలో అన్యాయం జరుగుతున్నా మాట్లాడకపోవడం తగదన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేయాలని బుధవారం ఉదయం పది గంటల నుంచి విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో 30 గంటల సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ దీక్షలను జయప్రదం చేయాలని కోరారు.

వీధి నాటిక వైతాళికుడు సఫ్దర్ హష్మీ

35వ వర్ధంతి సందర్భంగా నివాళి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన జాగృతికి జీవితాన్నే అర్పించిన వీధి నాటిక వైతాళికుడు సఫ్దర్ హష్మీ చిరస్మరణీయుడని ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యాలయంలో హష్మీ 35వ వర్ధంతి సభ జరిగింది. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో హష్మీకి నివాళులర్పించారు. రాష్ట్ర, జిల్లాల నాయకులు ఎస్‌కె ఖాసీం, జివి రంగారెడ్డి, పి అప్పన్న, ఎ జగన్, డి శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. ప్రజా చైతన్యానికి వీధి నాటికను అత్యంత శక్తిమంతంగా వినియోగించిన గొప్ప కళాకారుడు, జననాట్య మండలి వ్యవస్థాపక నాయకుడు సఫ్దర్ హష్మీ అని అన్నారు. ప్రజలకు వాస్తవాల్ని కళ్లకు కట్టేలా 'హల్లాబోల్' అనే వీధి నాటికను జనరంజకంగా ప్రదర్శిస్తున్న సందర్భంగా దేశ రాజధానిలో సంఘ విద్రోహశక్తులు మారణాయుధాలతో చేసిన దాడిలో హష్మీ సహా ఇద్దరు కళాకారులు అమరులైన సంఘటనను వక్తలు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ప్రధాన క్యారదర్శి డివి రాజు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్ ఎస్ఎంఎస్ - 2 కార్మికులు

ఉక్కును దెబ్బతీసే కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీసే కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారానికి 1055వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ 2 కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ నాడు విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం ఎన్నో పోరాటాలు, బలిదానాలు, ప్రాణ త్యాగాలు జరిగాయని గుర్తుచేశారు. అటువంటి ఆంధ్రుల హక్కును దెబ్బతీసే శక్తులను తరిమికొట్టడానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాల పాలక, విపక్షాలు కేంద్రంపై సమిష్టి పోరుకు సమరభేరి మోగించాల్సి ఉందన్నారు. పక్క రాష్ట్రాల్లో ప్రజల ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలూ ఏకమవుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో ఆ కృషి జరగకపోవడం శోచనీయమన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, నాయుడు, గుమ్మడి నరేంద్ర పాల్గొన్నారు.

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి అరెస్ట్

- కోర్టులో హాజరు
- పది రోజుల రిమాండ్
- నందికొట్కూరు సబ్ జైలుకు తరలింపు
- ఏడేళ్లక్రితం కేసుకు సంబంధించి అరెస్టు



దశరథ రామిరెడ్డిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఆత్మకూరు (నంద్యాల)

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో సిద్దేశ్వరం అలుగు ఏర్పాటు కోసం ఏడు సంవత్సరాల క్రితం రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో సిద్దేశ్వరం అలుగు దగ్గర చేపట్టిన ఆందోళన సందర్భంగా పెట్టిన కేసులో మంగళవారం ఆయనను ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాలలో తన ఆఫీస్‌లో ఉన్న ఆయనను అరెస్టు చేసి ఆత్మకూరు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. పదిరోజుల రిమాండ్‌కు మెజిస్ట్రేట్ ఆదేశించడంతో నందికొట్కూరు సబ్‌జైలుకు తరలించారు. అంతకుముందు పోలీసు వాహనాన్ని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సిపిఎం పట్టణ కార్యదర్శి రణధీర్ ఆధ్వర్యంలో రైతులు, రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు అడ్డుకున్నారు. దశరథరామిరెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, రాయలసీమకు సాగు, తాగునీరు అడిగితే అరెస్ట్ చేయడం అన్యాయమని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులను పోలీసులు దౌర్జన్యంగా పక్కకు నెట్టివేసి దశరథరామిరెడ్డిని సబ్ జైలుకు తరలించారు. నంద్యాల నుంచి వెలుగోడు మీదుగా దశరథ రామిరెడ్డిని తరలించే సమయంలో రైతు సంఘం వెలుగోడు నాయకులు సుమారు 20 మంది రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టును ఎపి రైతు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు టి.రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎప్పుడో ఏడు సంవత్సరాల క్రితం సిద్దేశ్వరం అలుగు దగ్గర చేసిన ఆందోళన సందర్భంగా పెట్టిన కేసులను తిరగదోడి ఈ రోజు అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు.

తనిఖీలు చేసే అధికారం హయ్యర్ ఎడ్యుకేషన్‌కే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిఇడి కళాశాలల్లో తనిఖీలు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు కాంపిటెంట్ అథారిటీగా అధికారం ఇస్తూ ప్రభుత్వం మంగళవారం జిఓ ఒకటిని విడుదల చేసింది. ఈ మేరకు హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ జె శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామీణ ఉపాధి హామీపై దాడి!

(మొదటి పేజీ తరువాయి)

పని హక్కు నిరాకరిస్తున్నట్లు వెబ్‌సైట్ పేర్కొంది. అర్హులుగా ప్రకటించిన 14.35కోట్ల మంది జాబ్ కార్డుహోల్డర్లలో దాదాపు 12.7శాతం మంది అంటే దాదాపు 1.8కోట్ల మందికి ఎబిపిఎస్ లేదు. అందువల్ల వారు ఎంఎన్ఆర్ఇజిఎలో పనిచేయడానికి అర్హులు కాకుండా పోతున్నారు. గతంలో ప్రభుత్వం ఆన్‌లైన్ నమోదు పద్ధతిని పెట్టింది. అయితే, గ్రామీణ భారతంలో అనేక ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ వ్యవస్థ అంతంతమాత్రంగా ఉండడంతో పని ప్రదేశాల్లో కార్మికుల హాజరుకు గుర్తింపు లేకుండా పోయింది. ఆన్‌లైన్ నమోదు లేదన్న సాకుతో వారికి వేతనాలు చెల్లింపును నిరాకరిస్తూ వచ్చారు. ఇటువంటి చర్యలన్నీ చట్టంపై నేరుగా దాడి చేయడం కిందికే వస్తాయని సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శించింది. వంద రోజుల వరకు పరిమితి విధించడం వంటి కొన్ని లోటుపాట్లు ఈ పథకంలో ఉన్నప్పటికీ గ్రామీణ పేదలకు ఉపాధి హామీ ఒక వరంగా మారినట్లు ఆచరణలో రుజువైంది. ముఖ్యంగా నిరుద్యోగం వల్ల తీవ్ర ఇబ్బందుల్లో వున్న గ్రామీణ ప్రజానీకానికి ఇది కచ్చితంగా ఒక ఆశాకిరణమే. కానీ, మోడీ ప్రభుత్వం టెక్నాలజీని ఉపయోగించి చట్టబద్ధమైన వారి హక్కుపై దాడి చేస్తోంది. నరేగా హామీ ఇస్తున్న పని హక్కుపై జరుగుతున్న ఈ అక్రమ దాడిని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఉపాధి హామీతో ఆధార్ ప్రాతిపదిక చెల్లింపు వ్యవస్థను ముడిపెట్టి, తప్పనిసరి చేయడాన్ని తక్షణమే ఉపసంహరించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

నోటీసులు, ముందస్తు అరెస్టులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటామంటూ అధికారులు ఇచ్చిన నోటీసులను విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు దగ్ధం చేశారు. బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురంలో దీక్షా శిబిరాన్ని ఇన్‌ఛార్జి సిడిపిఒ నాగలక్ష్మి సందర్శించి నోటీసులు ఇవ్వగా, అంగన్‌వాడీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. వీటిని తీసుకోవడానికి తిరస్కరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అధికారులు ఇచ్చిన నోటీసులను అంగన్‌వాడీలు దగ్ధం చేశారు. చలో కలెక్టరేట్‌ను అడ్డుకోవడానికి ఏలూరుతో తహశీల్దార్ 144 సెక్షన్ అమలులోకి తెచ్చారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో సమ్మె శిబిరానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ వచ్చి సమ్మె విరమించాలని కోరారు. ఐదో తేదీలోగా విధులకు హాజరు కాకుంటే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. విజయనగరం జిల్లాలో అంగన్‌వాడీలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమ్మె శిబిరంలో సుజ్ఞానమ్మ అనే కార్యకర్త నీరసించి పడిపోవడంతో ఆమెను తోటి అంగన్‌వాడీలు ఆస్పత్రికి తరలించారు. గ్యాస్ సమస్య వల్ల ఈ ఇబ్బంది వచ్చిందని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సమ్మె శిబిరాన్ని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు సందర్శించి మద్దతుగా మాట్లాడారు.

డిప్యూటీ సిఎం నారాయణస్వామి కాన్వాయి అడ్డగింత

చిత్తూరు జిల్లా కార్వేటి నగరంలో జాతీయ రహదారిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కాన్వాయిని అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. దీంతో, ఆయన కారు దిగివచ్చి వారితో మాట్లాడారు. ఆయనకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు.

రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల మద్దతు

విజయవాడలో ధర్నా చౌక్‌లోని అంగన్‌వాడీల సమ్మె శిబిరానికి పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు వచ్చి మద్దతు తెలిపాయి. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి, టిడిపి నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, బెఫీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, ఎల్ఐసి రాష్ట్ర నాయకులు కళాధర్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రికి పార్టీ అధినేత చంద్రబాబు విజయవాడకు వస్తారని, అంగన్‌వాడీ యూనియన్ నేతలను పిలిపించుకుని వారి



విజయవాడ ధర్నాచౌక్‌లో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. వీటిని టిడిపి మ్యానిఫెస్టోలో పొందుపరిస్తామన్నారు. సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా నోటీసుల పేరుతో బెదిరింపులకు దిగితే మహిళలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ నెల 3న కలెక్టరేట్ వద్ద బైటాయించవద్దంటూ నగరంలోని సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ నుండి అంగన్‌వాడీ వర్కర్లకు తాఖీదులు పంపించడం దారుణమన్నారు. సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ బెదిరింపులకు అంగన్‌వాడీలు బెదిరిపోరని స్పష్టం చేశారు. యూనియన్ నాయకులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేటి బైఠాయింపు యథాతథం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమ్మె విరమించాలంటూ అంగన్‌వాడీలను బెదిరించడానికి బదులుగా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ నెల 5లోపు విధుల్లో చేరకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామంటూ కలెక్టర్లు జారీ చేసిన సర్క్యులర్లను ప్రస్తావిస్తూ అటువంటి వాటికి భయపడేది లేదని తెలిపాయి. నేడు (బుధవారం) తలపెట్టిన కలెక్టరేట్ల బైఠాయింపు కార్యక్రమంలో ఎటువంటి మార్పులేదని, దానిని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చాయి. ఈ మేరకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు) ప్రధానకార్యదర్శి కె సబ్బరావమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధానకార్యదర్శి జె లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధానకార్యదర్శి విఆర్ జ్యోతి ఒక ప్రకటన విడుదల చేశారు. 'బెదిరింపు' సర్క్యులర్లను కలెక్టర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

సోమయ్య, ముత్యాలరావు, జ్యోతిబసు, నూకరాజు, కె శ్రీనివాసరావు, ఎస్ రమణ హాజరయ్యారు. ఎఐటియుసి అనుబంధ సంఘం తరపున రంగనాయకులు, సుబ్బారాయుడు, బి రవి, ఎఐసిటియు నాయకులు జి ప్రసాదు, గుంటూరు స్వతంత్ర సంఘం నాయకులు మధుబాబు, ఎస్ శంకరరావు, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఆనంద్, బి రవి పాల్గొన్నారు.

మేనిఫెస్టో చూపించిన నాయకులు

చర్చల సమయంలో సమాన పనికి సమాన వేతనం ఇస్తామన్నారని, వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలోనూ పేర్కొన్నారని, వాటినే అమలు చేయాలని కోరుతున్నామే తప్ప గొంతెమ్మ కోర్కెలు కాదని పేర్కొంటూ నాయకులు వైసిపి మేనిఫెస్టో, 2015 మున్సిపల్ సమ్మెలో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన వీడియోనూ మంత్రులకు చూపించారు.

న్యాయం జరిగే వరకూ సమ్మెను విరమించం : కె ఉమామహేశ్వరరావు

మున్సిపల్ కార్మికుల విషయంలో ప్రభుత్వం న్యాయంగా వ్యవహరించే వరకూ సమ్మె విరమించేది లేదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు తెలిపారు. చర్చల అనంతరం సెక్రటేరియట్లో మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను సిఎం రాతిమనుషులుగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఒక మెట్టుదిగినా చివర్లో బెదిరింపులకు దిగారని అన్నారు. ప్రభుత్వం స్పందించి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సమ్మె మరింత తీవ్రం చేస్తామని, మంచినీటి సరఫరా నిలిపేస్తామని, వీధిలైట్లను ఆపేస్తామని హెచ్చరించారు.

మాకు న్యాయం చేయండి : సెక్రటేరియట్ స్వీపర్స్ నిరసన

రాజధాని ఏర్పాటు అయినప్పటి నుండి తాము విధులు నిర్వహిస్తున్నామని, తమను ఆప్కాస్‌లో చేర్చాలని రాష్ట్ర సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న 154 మంది వర్కర్లు నిరసన తెలిపారు. సిఎం వద్దకు వెళ్లిన సమయంలో ఆప్కాస్‌లో చేరుస్తామని హామీనిచ్చారని, ఇంతవరకు అమలుకు నోచలేదని తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామని పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ సంఘాల నాయకులతో చర్చల సందర్భంగా మంత్రుల కమిటీ దృష్టికి వారు తమ సమస్యలు తీసుకువెళ్లారు.


పల్నాడు జిల్లా నరసరావుపేటలో మున్సిపల్ కార్మికులతో వాగ్వివాదానికి దిగిన ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి



కడప జిల్లా బద్వేలులో మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఆవాజ్ నాయకులు

మున్సిపల్ కార్మికులపై దాష్టీకం

ప్రజాశక్తి - యంత్రాంగం

మున్సిపల్ కార్మికులపై పోలీసులు అక్రమ అరెస్టులకు తెగబడ్డారు. పలు చోట్ల పోలీసు వలయంలో పోటీ కార్మికులతో అధికారులు పనులు చేయించారు. వారిని కార్మికులు ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో పోలీసులు బలవంతపు అరెస్టులకు పాల్పడ్డారు. విశాఖలో 500 మంది కార్మికులను, ప్రజాసంఘాల నాయకులను స్టేషన్లకు తరలించారు. పల్నాడులో స్వయానా ఎమ్మెల్యేనే పోటీ కార్మికులను రంగంలోకి దింపారు. వారిని కార్మికులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యే అనుచరులు దాడికి పాల్పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్మికులు నిరసనలు తెలిపారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రోద్బలంతో పోటీ కార్మికులను దింపారు. వీరిని అడ్డుకునేందుకు కార్మికులు ప్రయత్నిస్తుండగా వారిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారు. దీంతో కార్మికులను పోలీసులు సమ్మె శిబిరం వద్దకు తీసుకెళ్లారు. అయితే ఎమ్మెల్యే దగ్గరుండి పనులు చేయిస్తుండడంతో కార్మికులు మరోసారి అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నాయకులపై ఎమ్మెల్యే సైతం వాగ్వాదానికి దిగారు. పోలీసుల రక్షణ వలయంలో పోటీ కార్మికులతో పనులు చేయించారు. ఇదిలా ఉండగా యూనియన్ జిల్లా కార్యదర్శి సాల్మన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విడుదల కోసం కార్మికులు స్టేషన్ ఎదుట బైఠాయించారు. దీంతో పోలీసులు ఆయనను విడుదల చేశారు. తెనాలిలో సమ్మె శిబిరాన్ని జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ సందర్శించి మద్దతు తెలిపారు. విశాఖ జివిఎంసి పరిధిలో వాహనాలను నిలిపి ఉంచే యార్డుల వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. పోటీ కార్మికులతో వాహనాలను బయటకు తీసి పారిశుధ్య పనులను చేపట్టడం కోసం జివిఎంసి అధికారులు చేసిన ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించారు. వాహనాలను బయటికి తీయకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎక్కడకక్కడ అరెస్టులకు పాల్పడ్డారు. విశాఖ నగర పరిధిలో 500 మందిని అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు. నీటి సరఫరా కార్మికులు కూడా సమ్మెలోకి దిగారు. సమ్మెలో భాగంగా వారంతా జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. వారి పోరాటానికి విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సంఘీభావం తెలిపారు. మధురవాడ ప్రాంతంలో కార్మికులను పోలీసులు ఈడ్చుకుంటూవెళ్లి జీపుల్లో ఎక్కించారు. అనకాపల్లిలో జివిఎంసి జోనల్ కార్యాలయం ముందు వంటా-వార్పు చేపట్టారు. చెత్తను తరలించేందుకు పోటీ కార్మికులను అధికారులు తీసుకురాగా అడ్డుకున్నారు.

ప్రకాశం జిల్లా చీమకుర్తిలో పోటీ కార్మికులను అడ్డుకున్న మున్సిపల్ కార్మికులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. కార్మికుల అక్రమ అరెస్టును అడ్డుకున్న ప్రజాసంఘాల నాయకులను సైతం అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంకాలం వారందరిని విడుదల చేశారు. నెల్లూరులో కార్పొరేషన్ అధికారులు పోటీ కార్మికులను విధుల్లోకి తీసుకొచ్చి విజయమహాల్ గేటు ప్రాంతంలో చెత్త తొలగింపుకు పూనుకోగా... కార్మికులు అడ్డుకున్నారు.పోటీ కార్మికులను అడ్డుకోవద్దంటూ హెల్త్ ఆఫీసర్, పోలీసు అధికారులు వాగ్వివాదానికి దిగారు.

విజయవాడలో మున్సిపల్ సమ్మెకు సిఐటియు, సిపిఎం, బిజెపి, ఎల్‌బిసి, తదితర సంఘాలు మద్దతు తెలిపాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబసు పాల్గొని మాట్లాడారు. తక్షణం చర్చలు జరిపి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతపురం కార్పొరేషన్ వద్ద ప్రభుత్వ తీరును నిరసిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఫొటోలతో ఉన్న మాస్కులు ధరించి... కార్మికులపై అనుసరిస్తోన్న నిర్లక్ష్య వైఖరిని కళారూపంలో తెలియజేశారు. తాడిపత్రిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పాల్గొన్నారు.


తిరుపతి జిల్లా గూడూరులో సమ్మె శిబిరం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.గోపీనాథ్ మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మోకాళ్లపై నిలబడి, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. కర్నూలు జిల్లా గూడూరులో తలకిందులుగా నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. కడప జిల్లా రాయచోటిలో డ్రమ్స్ వాయిస్తూ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, మండపేట, రామచంద్రపురం, మున్సిపల్ కార్యాలయాల వద్ద, తూర్పుగోదావరిలో కొవ్వూరు, నిడదవోలు మున్సిపల్ కార్యాలయాల వద్ద, కాకినాడ జిల్లాల్లో పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాలను కొనసాగించారు.

ఉరి తాళ్లతో ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

- 14వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారం 14వ రోజుకు చేరింది. మెడకు ఉరితాళ్లు వేసుకొని, కళ్లకు గంతలు కట్టుకొని నిరసనలు తెలిపారు. జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి అమలు చేయకుండా, నెలల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.విజయవాడలో ధర్నా చౌక్‌లో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మద్దతిచ్చి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ధర్నాచౌక్‌లో మెడకు ఉరితాళ్లు వేసుకుని ఉద్యోగులు నిరసన తెలిపారు.



విజయవాడలో ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి ఉద్యోగులకు మద్దతు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆత్మహత్యలే శరణమంటూ చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉరితాళ్లను మెడకు వేసుకుని నిరసన తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మెడకు ఉరితాళ్లు బిగించుకుని, కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. విశాఖ పశ్చిమ టిడిపి ఎమ్మెల్యే పి.గణబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లా కాకినాడలో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో డిఇఒ కార్యాలయాల వద్ద సమ్మె శిబిరాలను కొనసాగించారు. కాకినాడలో ఉరితాళ్లతో నిరసన తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన, విజయనగరంలో మానవహారం చేపట్టారు. అనంతపురంలో భిక్షాటన, మెడకు ఉరితాళ్లతో, సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఉరితాళ్లను మెడలో వేసుకుని నిరసన తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, శ్రీకాకుళం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉరి వేసుకొంటున్నట్లు నిరసనలు కొనసాగించారు.

టికెట్ల విషయంలో దళితులకు అన్యాయం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు

ప్రజాశక్తి- పూతలపట్టు (చిత్తూరు జిల్లా)



టికెట్ల విషయంలో దళితులకు వైసిపి అన్యాయం చేస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు ఆరోపించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో ఆయన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టికెట్ల కేటాయింపుపై తన ఆవేదనను తెలిపారు. గత అయిదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీ పెద్దలు, మంత్రులు చెప్పినట్టే తాను నడుచుకున్నానని, ఇప్పుడు తనపై వ్యతిరేకత ఉంటే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకున్న ఈ ఐదేళ్ళలో ఒక్కసారి కూడా మమ్మల్ని పిలిచి మాట్లాడలేదన్నారు. ఇప్పుడు ఐ-ప్యాక్ సర్వేలో తనకు అనుకూలంగా లేదని, ఈ దఫా పూతలపట్టు టికెట్ ఆశించవద్దని సిఎం జగన్ చెప్పడం తగదన్నారు. డబ్బులు ఇస్తే ఐ-ఫ్యాక్ వాళ్ళు సర్వే ఫలితాలు ఎలాగైనా మారుస్తారని, టికెట్ల విషయంలో దళితులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ ఇవ్వకపోయినా పార్టీ అధిష్టాన నిర్ణయాన్ని గౌరవిస్తానని, నియోజకవర్గంలో తనను నమ్ముకున్న వారికి ఎప్పుడూ తోడుగా ఉంటానని తెలిపారు.

గిరిజనులకు, రైతులకు 'హైడ్రో' ముప్పు

- సిపిఎం రాష్ట్ర నాయకులు లోకనాథం

ప్రజాశక్తి - దేవరాపల్లి (అనకాపల్లి)


'హైడ్రో' కోసం మట్టి నమూనా పరీక్షలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లోకనాథం, తదితరులు

గిరిజనులకు, రైతులకు హైడ్రో పవర్ ప్రాజెక్టుతో తీవ్ర ముప్పు వాటిల్లనుందని, రైవాడ జలాశయానికి నష్టం జరగనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె లోకనాథం అన్నారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలోని బలిపురం సమీపం నుంచి వీలుపర్తి పంచాయతీ మారికకొండ వరకు అదానీ కంపెనీ తలపెట్టిన హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణ నిమిత్తం మట్టి నమూనా పరీక్షలకు తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలను లోకనాథం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్లాంట్ పనులు కోసం అదానీ కంపెనీ పర్యవేక్షణలో కొల్‌కతాకు చెందిన కంపెనీ ఈ తవ్వకాలు చేపట్టిందన్నారు. స్వయాన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి బూడి ముత్యాలనాయుడు నియోజకవర్గంలో ఇదంతా జరుగుతోందని తెలిపారు. చింతలపూడి, తామరబ్బ పంచాయతీల సర్పంచ్‌లకూ, చివరికి స్థానిక తహశీల్దారుకు, జిల్లా కలెక్టర్‌కూ తెలియకుండా రహస్యంగా మట్టి నమూనాలను సేకరిస్తున్నారని తెలిపారు. దీనిని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. గతంలో రైవాడ ప్రాజెక్టుపై హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం పొందినట్లు వచ్చిన వార్తలు ఇప్పుడు నిజమయ్యాయన్నారు. దీనిపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో తాత్కాలికంగా పనులు నిలుపుదల చేశారన్నారు. గ్రామ సభలు జరపకుండా ప్రజల ఆమోదం లేకుండా మోసపూరితంగా అదానీ కంపెనీ ఈ తవ్వకాలు జరపడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైతే చింతలపూడి పంచాయతీలోని తొమ్మిది గ్రామాలు, తామరబ్బ పంచాయతీలోని ఏడు గ్రామాలతో పాటు పెద్ద మొత్తంలో వ్యవసాయ భూములు పూర్తిగా ముంపునకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల, రైతుల జీవనాధారం దెబ్బతింటుందన్నారు. తవ్వకాలను పరిశీలించిన వారిలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర, స్థానిక గిరిజన ప్రజలు ఉన్నారు.

'తూర్పు'లో ఘోర రోడ్డు ప్రమాదం

- చిన్నారితో సహా ముగ్గురు మృతి
- ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి - దేవరపల్లి(తూర్పు గోదావరి)

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం బందపురం ఫ్లైఓవర్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్నారి సహా ముగ్గురు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్‌కు చెందిన ఈడిగ సుభాష్‌గౌడ్ తన భార్య దివ్యప్రియ (25), కుమార్తె గనిష్క (19 నెలలు), తల్లి రమాదేవి (56), సోదరి స్వప్న, భావ మల్లికార్జున, మేనల్లుడు వికాష్‌సాయిలతో కలిసి కారులో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు విశాఖలోని అత్తగారింటికి కారులో వెళ్లారు. అనంతరం అదే కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. దేవరపల్లి మండలం బందపురం వద్దకు వచ్చేసరికి కొవ్వూరు వైపు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో హైదరాబాద్ వెళ్తున్న సుభాష్‌గౌడ్ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దివ్యప్రియ, గనిష్క, రమాదేవి అక్కడికక్కడే మృతి చెందారు. సుభాష్‌గౌడ్, స్వప్న, మల్లికార్జున, వికాష్‌సాయితోపాటు కొవ్వూరు వైపు వెళ్తున్న కారులో ఉన్న వేల్పుల విజయ్‌మోహన్, వేల్పులు సృజనీగౌస్, వేల్పుల అమృతశ్రీ, వేల్పుల రోహిణి గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రాజమండ్రి ఆస్పత్రికి


ప్రమాదానికి గురైన కారు

తరలించే ఏర్పాటు చేశారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. సుభాష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాగర పరిశ్రమతో అభివృద్ధి

- కేంద్ర మంత్రి పర్షోత్తం

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

సాగర్ పరిశ్రమతో సముద్రతీర ప్రాంతాలు, మత్స్యకారుల జీవితాలు అభివద్ధి చెందుతాయని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. బాపట్ల జిల్లా చీరాల వాడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రాంతాల్లో కేంద్ర మంత్రి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. త్వరలో అమలులోకి రానున్న మత్స్యకార అభివద్ధి పథకాలను మత్స్యకారులకు మేలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 150 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.48 లక్షలు రుణాలు, మత్స్య సంపద వేటకు అవసరమైన పరికరాలు, ప్రాణ రక్షణ సాధనాలను మత్స్యకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్ మాట్లాడారు. తొలుత ఓడరేవుకు చేరుకున్న కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాలను జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సంపాదకీయం


ఇదా సహకార ఫెడరలిజం?

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, హిమాచల్‌ప్రదేశ్ తదితర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల శకటాలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడం సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడవటమే! 'ఇండియా అనగా భారత్ రాష్ట్రాల సమాహారం'గా ఉంటుందంటూ రాజ్యాంగంలో పేర్కొన్న సమాఖ్య సూత్రాలకు, సమానత్వానికి ఈ చర్య విఘాతం. రాజ్యాంగానికి, దాని విలువలకు పునరంకితమౌతామని ప్రతినబూనడానికి గణతంత్ర దినోత్సవాలను నిర్వహించుకుంటాం. 75 సంవత్సరాల స్వాతంత్ర్యోద్యమ అమృత ఉత్సవాలను జరుపుకుంటుండటంతో ఈ ఏడాది ఉత్సవాలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మత రాజ్యంగా మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న మోడీ సర్కారు అందుకు ఆటంకంగా ఉన్న రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు అన్ని యత్నాలు చేస్తోంది. ఈ ఏడాది రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికైన శకటాల తుది జాబితా ఇప్పటివరకూ ఖరారు కానప్పటికీ ప్రతిపక్షాల పాలనలో ఉన్న మూడు రాష్ట్రాల శకటాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించడంపై తీవ్ర చర్చ నడుస్తోంది.

రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి, సాధించిన ప్రగతికి, సాధించబోయే లక్ష్యాలకు ప్రతీకలుగా శకటాలను రాష్ట్రాలు రూపొందిస్తాయి. ఏటా జనవరి 26న రాజ్‌పథ్ (ప్రస్తుత కర్తవ్యపథ్)లో రాష్ట్రాలు ప్రత్యేక శకటాలను ప్రదర్శించడం 1953 నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది 30 రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాలు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపాయి. ఏటా 15 నుంచి 16 రాష్ట్రాలకే అవకాశం లభిస్తోంది. 2017 నుంచి గత ఎనిమిదేళ్లలో ఆరు సార్లు పంజాబ్, ఐదుసార్లు పశ్చిమబెంగాల్, మూడుసార్లు ఢిల్లీ శకటాలు తిరస్కరణకు గురయ్యాయి. 'ప్రజాస్వామ్యానికి తల్లి - ఇండియా' 'వికసిత భారత్' ఈ ఏడాది రిపబ్లిక్ డే దినోత్సవ కీలక అంశాలుగా కేంద్రం సెప్టెంబర్‌లో ప్రకటించింది. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, లాలా లజపతిరాయ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగనిరతిని చాటేలా పంజాబ్, విద్య, వైద్య రంగాల్లో ప్రగతిపై ఢిల్లీ, కన్యాశ్రీ పథకాన్ని పరిచయం చేస్తూ పశ్చిమ బెంగాల్ శకటాలను రూపొందించాయి. ఏటా మాదిరిగానే కేంద్రం చెప్పేదొకటే... ఆయా రాష్ట్రాల శకటాలు తమ ఇతివృత్తాలకు అనుగుణంగా లేవని.

గత ఏడాదిసైతం ఇదే తంతు చోటుచేసుకుంది. బిజెపి ఏలుబడిలోని ఉత్తరప్రదేశ్, గుజరాత్, అరుణాచల్‌ప్రదేశ్, హర్యానా, మేఘాలయ, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్, గోవాతోపాటు ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరిగిన మరో రెండు మూడు రాష్ట్రాల శకటాలకే అనుమతించారు. కేరళ ప్రభుత్వం రూపొందించిన నారాయణ గురు శకటాన్ని, తమిళనాడు ప్రభుత్వం రూపొందించిన తొలి స్వాతంత్ర్య సమరయోధురాలు వేనాచయ్యార్ శకటాన్ని, మన రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య శకటాన్ని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రూపొందించిన సుభాష్ చంద్రబోస్ శకటాన్ని తిరస్కరించారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని చాటిచెప్పేలా శకటాలు రూపొందించాలంటూ...అలాంటి త్యాగశీలుర శకటాలను తిరస్కరించడం బిజెపి కపటత్వానికి నిదర్శనం. ఇవన్నీ ప్రదర్శనకు నోచుకుంటే దేశ ప్రజలను ఏకతాటిపై నిలిపిన మహోజ్వల చరితను కళ్ల ముందు సాక్షాత్కరింపజేయడమే. ఆ మహత్తర పోరాటంలో ఎటువంటి భాగస్వామ్యం లేకపోగా, నీరుగార్చేందుకు శాయశక్తులా ప్రయత్నించిన ఆర్‌ఎస్‌ఎస్ అసత్య ప్రచారం సాగిస్తోంది. నాటి ఉద్యమ ఘట్టాలు వెలుగుచూస్తే.. తమ బాగోతం బయటపడుతుందనే గత ఏడాది తిరస్కరింది. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాల్సిన గణతంత్ర వేడుకల్లో లౌకిక విలువలకు, రాష్ట్రాల హక్కులకు విఘాతం కలిగించడం రాజ్యాంగంపై దాడే. ఈ ఏడాది ప్రదర్శనకు ఎంపికైన శకటాల్లో 90 శాతం బిజెపి పాలనలోనివేనని పంజాబ్ సిఎం పేర్కొన్నారు. రాజకీయ కారణాల వల్ల రాష్ట్రాల శకటాలను తిరస్కరించారన్న విమర్శలపై పూర్తిస్థాయిలో స్పందించి, వాటిని సరిచేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. ఇప్పటికైనా కేంద్రం ప్రకటించిన ఇతివృత్తానికి అనుగుణంగా రూపొందించిన శకటాలను అనుమతించాలి. భారత రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి వ్యవహరించాలి. అందుకు కేంద్రంపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాతంత్ర వాదులు ఒత్తిడి తేవాలి.

మహనీయుల మాట



ఈ మట్టిలో పుట్టిన ప్రతి మనిషికీ ఆహార లభ్యత కనీస హక్కు.

- నార్మన్ బోర్లాగ్, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త.

లింగ సమానత్వంతోనే మహిళా సాధికారత

స్మృతి



నక్కా వెంకటేశ్వర్లు

మహిళల హక్కుల కోసం తన జీవితం మొత్తాన్ని త్యాగం చేసిన ఆదర్శమూర్తి సావిత్రిబాయి ఫూలే. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా, మహిళలు చదువుకోవడం ద్వారానే సామాజిక, రాజకీయ, ఆర్థిక సాధికారిత సాధిస్తారని, వారి హక్కులను స్వేచ్ఛాయుత వాతావరణంలో పొందడానికి కావలసిన పరిస్థితులు ప్రభుత్వాలు కల్పించాలని గొంతెత్తి పోరాడిన ధీరవనిత. అటువంటి సావిత్రిబాయి ఫూలే జయంతి ప్రతి యేటా జనవరి 3న జరుపుకుంటున్నాం. ఈ జయంతి ఉత్సవాల ద్వారా సావిత్రిబాయి ఫూలే సాధించిన విజయాలను మననం చేసుకుంటూ రాజ్యాంగం కల్పించిన సమాన పనికి సమాన వేతనం, సమాన హక్కులను సాధించుకోవడానికి కృషి చేద్దాం.


రాజ్యాంగంలో మహిళలు

ఆర్టికల్-14 ప్రకారం మతం, జాతి, కులం, లింగ, జన్మస్థలం ఆధారంగా వివక్షత కూడదు. ఆర్టికల్-15 ప్రకారం మహిళల, పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక కేటాయింపులు ఉండాలి. సమాజంలో, పనిచేసే ప్రదేశంలో గౌరవం, మర్యాదలతో బాటు విద్య, ఆరోగ్య సంరక్షణ, సమాన పనికి సమాన వేతనం, రాజకీయ భాగస్వామ్యం, గృహ హింస వ్యతిరేక హక్కు, మన రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులు.

మాటల్లో మహిళలను దేవతలుగా చూపుతూ, ఆచరణలో వంటింటికి మాత్రమే పరిమితమయ్యేలా నేటి పాలకులు చట్టాలు రూపొందిస్తున్నారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసమే తమ ప్రభుత్వాలు పని చేస్తుంటాయని ప్రతి సందర్భంలో చెబుతుంటారు. మహిళలపై దాడులు, హింస, హత్యలు జరిగినప్పుడు హడావుడి చేయటం, కొత్త కొత్త చట్టాలు తీసుకురావడం, తర్వాత వాటిని అమలు పరచకపోవడం వీరి నైజం. రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని కాపాడుకోవడం కోసం కూడా పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన పరిస్థితులు నేడు ఏర్పడుతున్నాయి. ఎప్పుడో 18వ శతాబ్దంలో సావిత్రిబాయి ఫూలే చేసిన పోరాటాల ఫలితంగా ఈరోజు రాజ్యాంగంలో మహిళలకు కనీసం హక్కులైనా పొందుపరిచారు.

విద్య ఒక ప్రయోగశాల

1986 నూతన విద్యా విధానం వచ్చిన తర్వాత నాణ్యమైన విద్య, అందుబాటులో విద్య, బాలికల అక్షరాస్యత పెంపుదల లక్ష్యాలుగా ఆపరేషన్ బ్లాక్ బోర్డ్, డిపిఇపి, ఎపెప్... తెరమీదకు వచ్చాయి. వీధి వీధిన పాఠశాల ఏర్పాటు చేశారు. బాలికలలో విద్యను పెంపొందించేందుకు పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఏర్పాటు చేశారు. పాఠశాలలు ఒక ఉపాధ్యాయుడు వుంటే ఇద్దరు, ఇద్దరుంటే ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా ఏర్పాటు చేసారు. క్రమంగా రాజకీయ నాయకుల ప్రమేయంతో పేట, వీధి, గూడెంలో పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా అనేక పాఠశాలలు వెలిశాయి. ఈ ప్రయోగాల అమలు కోసం స్వచ్ఛంద సంస్థలు, విద్యారంగ నిపుణులు, రకరకాల కన్సల్టెంట్లు, రిసోర్స్ పర్సన్లు పుట్టుకొచ్చారు. కొత్త కొత్త గ్రంథాలు, లెక్కలేనన్ని ట్రైనింగ్‌లు,



మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా, మహిళలు చదువుకోవడం ద్వారానే సామాజిక, రాజకీయ, ఆర్థిక సాధికారిత సాధిస్తారని, వారి హక్కులను స్వేచ్ఛాయుత వాతావరణంలో పొందడానికి కావలసిన పరిస్థితులు ప్రభుత్వాలు కల్పించాలని గొంతెత్తి పోరాడిన ధీరవనిత సావిత్రిబాయి ఫూలే. ఆమె జయంతిని ప్రతి యేటా జనవరి 3న జరుపుకుంటున్నాం. ఈ జయంతి ఉత్సవాల ద్వారా సావిత్రిబాయి ఫూలే సాధించిన విజయాలను మననం చేసుకుంటూ రాజ్యాంగం కల్పించిన సమాన పనికి సమాన వేతనం, సమాన హక్కులను సాధించుకోవడానికి కృషి చేద్దాం.

నేడు సావిత్రిబాయి ఫూలే జయంతి

పరిమితికి మించిన బోధన సామగ్రి సిద్ధమయ్యాయి. ప్రాజెక్టును సమీక్షించడానికి లక్షలాది ఫారాలు నింపడం, నింపిన ఫారాన్ని మరలా మరలా నింపడం, సంవత్సరంలో సగం రోజులు ఉపాధ్యాయులు బోధన కంటే శిక్షణకు పరిమితం కావడం నిత్యకృత్యమైంది. అంతిమంగా ఉన్న విద్యా వ్యవస్థకు సమాంతరంగా మరో వ్యవస్థను నిర్మించడం ద్వారా వున్న వ్యవస్థల్ని నీరుగార్చారు. ఫలితంగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సిఇఆర్‌టి), డైట్ (డిఐఇటి) లు బలహీన పడ్డాయి.

ఈ క్రమంలో నూతన జాతీయ విద్యా విధానం-2020 ముందుకు వచ్చింది. మరిన్ని ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. అందుబాటులో పాఠశాల, నాణ్యమైన విద్య, బాలికలకు ప్రత్యేక విద్య అనే లక్ష్యాలు కనుమరుగై అంతర్జాతీయ విద్యార్థిగా తయారు చేయటం అనే లక్ష్యం ముందుకు వచ్చింది. గతంలో జరిగిన ప్రయోగాల ఫలితం ఏమిటనేది సమీక్షించకుండానే పాఠశాలలు బలహీనమయ్యాయి కనుక పిల్లల సంఖ్య తగ్గింది అనే పేరుతో బడులను కుదించే ప్రయత్నం చేస్తున్నారు. అన్ని రకాల పోస్టులను సర్దుబాటు పేరుతో తగ్గిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 50 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేస్తే ఇక్కడ రాష్ట్రంలో 25 వేల పోస్టులు అదనంగా ఉన్నాయని రేషనలైజేషన్ చేసి కుదించారు. పాఠశాలల విలీనం పేరుతో 4750 ప్రాథమిక పాఠశాలల నుండి 3,4,5 తరగతులను కిలోమీటర్ లోపు ఉన్న ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీనితో 14 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. సుమారు 500 పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఒక్క విద్యార్థి కూడా పాఠశాలలో చేరలేదు. సుమారుగా మూడున్నర లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదిలి వెళ్లారు. వీరిలో సగానికి పైగా బాలికలే. భవిష్యత్తులో ఈ పాఠశాలలన్నీ మూసివేతకు గురవుతాయి. మరోవైపు జిఓ 117 అమలు పరచి ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించారు. ఈ విధంగా విద్యారంగాన్ని ఒక ప్రయోగశాలగా మార్చడం ద్వారా ప్రభుత్వ విద్యారంగం బలహీన పడుతున్నది.

పాలకుల వైఖరి

72, 73 రాజ్యాంగ సవరణల ద్వారా మహిళలకు స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేశారు. స్థానిక సంస్థలలో 33 శాతం మంది వార్డు మెంబర్లుగాను, సర్పంచులుగాను, ఎంపిటిసిలుగాను, జడ్‌పిటిసి లుగాను వచ్చారు. పరిపాలన బాధ్యతలు స్వీకరించారు. కానీ ఆచరణలో మాత్రం వారి భర్తలు లేదా తండ్రులు చేస్తున్నారు. ఇప్పుడు చట్ట సభల్లో సైతం 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేశారు. కాని, అమలు మాత్రం 2029 సార్వత్రిక ఎన్నికల నుండే వర్తింపజేస్తారట.

మరోవైపు రాజ్యాంగంలో 30కి పైగా చట్టాలు మహిళల హక్కుల పరిరక్షణ కోసం చేయబడ్డాయి. మహిళాపై దాడులు జరిగితే వెంటనే దిశ, నిర్భయ లాంటి చట్టాల్ని తీసుకొచ్చారు. అయితే ఈ చట్టాలన్నీ కాగితాలకే పరిమితం. ఎక్కడ ఏ దాడి జరిగినా అది కుల, మత, ప్రాంతీయ, రాజకీయ ఘర్షణగానో లేదా కుల దురహంకార హత్యగానో ఉంటున్నది. వీటిలో బలవుతున్నది ప్రధానంగా మహిళలే. నిన్నగాక మొన్న నాగాలాండ్, హిమాచల్ ప్రదేశ్‌లో మహిళలపై జరిగిన దారుణ సంఘటనలు, జమ్ము కాశ్మీర్‌లో మత ఘర్షణలు, ప్రేమ పేరుతో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఎన్ని చట్టాలు చేసినా, మహిళాపై దాడులు ఆగటం లేదు. ప్రధాన కారణం మహిళ పట్ల పాలకుల దృక్పథం. మహిళలు వంటింటికే పరిమితం కావాలన్నది పాలక వర్గాల ఆలోచన ధోరణి. వీటికి తార్కాణంగానే కేంద్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయ నాయకులు మహిళల వస్త్రధారణ మీద, ఆహారపు అలవాట్ల మీద, స్వేచ్ఛ స్వాతంత్ర్యాల మీద ఆంక్షలు విధించాలని బహిరంగంగా మాట్లాడుతున్నారు. చట్టాలు ఎన్ని ఉన్నా పాలకుల చిత్తశుద్ధి లేకుండా మహిళలపై దాడులను అరికట్టడం సాధ్యం కాదు.

పిల్లల కోసం మనం

రాజ్యాంగంలో మహిళల హక్కుల కోసం చట్టాలు చేయబడ్డాయి. మహిళలపై దాడులేమైనా జరిగినప్పుడు కొత్త కొత్త చట్టాలు ముందుకు వస్తున్నాయి. విద్యల్లో రకరకాల ప్రయోగాలు దేశంలో, రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. కానీ ఇప్పటికీ మహిళా అక్షరాస్యత శాతం 64 శాతానికి మించలేదు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అక్షరాస్యత శాతం 50 లోపు గానే ఉన్నది. ఇప్పటికి చాలా పాఠశాలలు మూసివేత దశలో ఉన్నాయి. చాలామంది పిల్లలు డ్రాప్ అవుట్ అవుతున్నారు. ఐదవ తరగతి చదివేటువంటి పిల్లలకు రెండవ తరగతి పాఠ్య పుస్తకాలు చదవటం రాయటం రావటం లేదని అసర్, అంతర్జాతీయ విద్య సంస్థల సర్వే నివేదికలు తెలుపుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల మీద తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా పోయింది. దీనికి ప్రభుత్వ విధానాలు, పర్యవేక్షణ పేరుతో పాఠశాలలు బలహీనపరచడం కారణాలుగా ఉండొచ్చు. కానీ తల్లిదండ్రులు నమ్మకంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే ఆ పిల్లవాడు ప్రాథమిక పాఠశాల స్థాయి విద్య పూర్తయ్యే నాటికి తెలుగు, ఇంగ్లీష్ భాషలలో చదవటం, రాయడం, మాట్లాడడం, గణిత చతుర్విధ ప్రక్రియలు వస్తున్నాయా? ప్రతి విద్యార్థికి తెలుగు, ఇంగ్లీషులలో చదవడం, రాయడం మాట్లాడడం, గణితం చతుర్విధ ప్రక్రియలు వచ్చేందుకు ప్రత్యేక కషి ఉపాధ్యాయులు చేయాలి. పిల్లల్లో ఈ సామర్థ్యాలు పెంపొందించడానికి అవసరమైతే ఒక గంట అదనంగా పాఠశాలలో పనిచేయటం కోసం సమయాన్ని హెచ్చించాలి. ఇప్పటికే పాఠశాలలో బోధనేతర పనుల ఒత్తిడి, అధికారుల పర్యవేక్షణ పేరుతో మానసిక ఒత్తిడి ఎన్ని ఉన్నా పిల్లల్లో చదవటం రాయటం గణిత సామర్థ్యాలను సాధించడంలో మనం కృషి చేయాలి. సమాజానికి ప్రభుత్వ పాఠశాల మీద ఒక నమ్మకాన్ని కలిగించాలి. ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవడం ద్వారానే ప్రభుత్వ విద్యారంగాన్ని తద్వారా భవిష్యత్తులో తయారయ్యే పౌరులకు నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత, సమిష్టి విధానం, ఈ దేశం మన అందరిదీ అనే భావన కలిగించడానికి కృషి చేయాలి. తల్లిదండ్రులతో మమేకమయ్యే కార్యక్రమాలు రూపొందించుకొని అమలు చేయాలి.

మహిళా సాధికారత

యునెస్కో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించి లింగ సమానత్వం సాధించడం ద్వారా మహిళల్లో ఆర్థిక సాధికారతను సాధించాలని ప్రకటన చేసింది. మహిళా ఆర్థిక సాధికారత సాధించడమంటే విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారాన్ని మహిళలకు అందించడంలో ప్రభుత్వం బాధ్యత తీసుకోవడమే.

- అన్ని హంగులతో ప్రతి పంచాయతీకి ఒక ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాలి.
- ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రాథమిక పాఠశాలతో అనుసంధానం చేయాలి.
- సమాంతర మీడియం వ్యవస్థను కొనసాగించాలి.
- ఏ మీడియంలో చదువుకోవాలనేది విద్యార్థులకు స్వేచ్ఛనివ్వాలి.
- ఉపాధ్యాయ ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలి.
- బాలికా విద్య కోసం ప్రత్యేక నిధులను కేటాయించాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగం కోసం 30 శాతం కేటాయించాలి.

చదువు చైతన్యాన్ని ఇస్తుంది. ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిస్తుంది. సమాజంలో నూతన ఉత్పత్తుల తయారీకి మార్గాన్ని సుగమం చేస్తుంది. ప్రజలు మరింత సుఖవంతంగా బతకడానికి కావలసిన పునాదిని ఏర్పరుస్తుంది. అలాంటి విద్య ప్రభుత్వ ఆధీనంలో ఉండడం ద్వారా మాత్రమే ఇవన్నీ సాధ్యమవుతాయి.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం. రాజ్యాంగ విలువల్ని పరిరక్షించుకుందాం. సమానత్వపు భావాలను పెంపొందించుకుందాం. ఈ దేశం అందరిదీ అనే భావన మరింత బలపరుచుకుందాం.

(వ్యాసకర్త యు.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు)

కవిత్వం

ఒక అద్భుతం!

పుస్తకం ఎంత అద్భుతమైంది ?
చెట్టుతో తయారైన ఒక బల్ల పరుపు వస్తువు
సులభంగా అటూ ఇటూ కదల గలిగే విచిత్రం
తెల్లటి ఒంటి మీద కొన్ని గజిబిజి ఆకారాలు
అద్దుకుని, నీకోసం ఎదురు చూసే వస్తువు
ఒకే ఒక్క చూపుతో చూస్తే చాలు -
నువ్వు మరొకరి మెదడులోకి
నేరుగా ప్రవేశించగలవు -
ఆ మరొకరు బహుశా ..
వేల ఏళ్ళ క్రితమే కన్ను మూసిన వారు కావొచ్చు.
వేల ఏళ్ళ తర్వాత కూడా, కొందరు రచయితలు
నిశ్శబ్దంగా, స్పష్టంగా నీ తలలో
మాట్లాడుతున్నారూ
అంటే - రాయడం అనేది
మానవుడి ఆవిష్కరణలో ఎంత గొప్పది?
ఎంత సున్నిత మైంది? ఎంత సుందరమైంది?
నీ పరిచితులని, అపరిచితులని
వేల వేల యుగాల్లో
వేరు వేరు దేశాలో
ఉన్న వాళ్ళందరినీ ఒక్కటిగా కలిపేది!
కాలం అడ్డు గోడల్ని ధ్వంసం చేసేది!!
మానవ మేధకు ఒక ఉదాహరణ - పుస్తకం !
మనిషి మహాద్భుతాలు సాధించాడనడానికి-
ఒక రుజువు!!

(విజయవాడ పుస్తక మహోత్సవాన్ని పురస్కరించుకుని...)

- డా॥ దేవరాజు మహారాజు

జనవాక్యం

ఇకనైనా సైన్స్‌కు...?

గత సంవత్సరం చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 మిషన్లను విజయవంతంగా ప్రయోగించి భారత్ సత్తా ఏంటో ప్రపంచ దేశాలకు చూపింది ఇస్రో. అదే ఉత్సాహంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నూతన సంవత్సరం రోజున సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పిఎస్‌ఎల్‌వి-సి58 రాకెట్‌ను విజయవంతంగా ప్రయో గించింది. కాంతి ధ్రువణాన్ని కొలిచే ఎక్స్-పోశాట్ అనేది భారత్ మొదటి, ప్రపంచంలో రెండో అంతరిక్ష మిషన్. ఈ మిషన్ ప్రత్యేకమైనది, కీలకమైంది. ఎందుకంటే సవాల్‌తో కూడుకున్న బ్లాక్ హోల్స్, న్యూట్రాన్ స్టార్స్, యాక్టివ్ గెలాక్సీ న్యూక్లియెలు, పల్సర్ విండ్ నెబ్యులా వంటి వివిధ ఖగోళ మూలాల ఉద్గారాలను అర్థం చేసుకోవడానికి, కొలవడానికి సహాయ పడుతుంది. వివిధ ప్రసార మాధ్యమాలు ఇస్రో ప్రయోగాల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తుండటం వల్ల సామాన్య ప్రజలకు కూడా వీటి పట్ల ఆసక్తి పెరుగుతున్నది.

సైన్స్‌ను నమ్ముకున్న అనేక దేశాలు వివిధ రంగాల్లో అగ్ర పథంలో దూసుకుపోతున్నాయి. ఉదాహరణకు స్విట్జర్లాండ్. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ తాజాగా ఇచ్చిన నివేదికలో స్విస్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ దేశంలో కేవలం 90 లక్షల జనాభా మాత్రమే ఉంది. కానీ ప్రపంచంలో గొప్ప విశ్వ విద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు ఈ దేశంలోనే వున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రయోగశాల సెర్న్ జెనీవాలో ఉంది. మరొక ముఖ్యమైన పరిశోధన కేంద్రం పాల్ స్కెరర్ సంస్థ కూడా ఈ దేశంలోనే ఉంది. మొత్తంగా 114 మంది నోబెల్ విజేతలు స్విట్జర్లాండ్‌లో ఉన్నారు. నోబెల్ శాంతి బహుమతి కూడా పలుసార్లు స్విట్జర్లాండ్‌లో ఉండే సంస్థలకే వచ్చాయి. ఈ దేశ జనాభాలో దాదాపు మూడవ వంతు ప్రజలు ఏ మతాన్ని అనుసరించరు. స్విస్ తర్వాత గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో రెండవ స్థానంలో స్వీడన్ ఉంది. ఏ దేశానికైనా విద్య, ఆరోగ్య రంగాలు కీలకం. ఈ రెండు రంగాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చిన క్యూబా కరోనా మహమ్మారిని సమర్థవతంగా ఎదుర్కొంది.

భారత దేశ రాజ్యాంగం ప్రకారం మతం వ్యక్తిగత అంశం. కానీ పాలకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని ఉపయోగించు కుంటున్నారు. రక్షణ, అంతరిక్ష రంగంలో మన దేశం కొంత ప్రగతిని సాధించింది. అయితే ఆవిష్కరణల విషయంలో ఇంకా వెనుకబడే ఉంది. కొత్త ఏడాదిలోనైనా ఇస్రో అందిస్తున్న సేవల స్ఫూర్తితో పాలకులు సైన్స్ పరిశోధనలకు అధిక నిధులు మంజూరు చేయాలి. యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించాలి. విశ్వ విద్యాలయాలను పటిష్టం చేయాలి. సైన్స్ గురించి ప్రచారం చేసేవారిపై జరిగే దాడులను అరికట్టాలి. అప్పుడే మన దేశం నూతన ఆవిష్కరణలలో ముందుండే అవకాశం వుంది.

- యం. రాంప్రదీప్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి, సెల్ : 9492712836

ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణ నేర్పుతున్న పాఠం ఏమిటి?

సందర్భం



అరుంధతీ రాయ్

(నిన్నటి తరువాయి)

తమను తాము అత్యంత క్రూరంగా బాధించుకున్న యూదులకు, వారు స్థాన చలనం కలిగించిన వారి నిస్సహాయతను, కోరికను అర్థం చేసుకోవడం నిజానికి అసాధ్యమా? తీవ్రమైన బాధ నిత్యం క్రూరత్వాన్ని ప్రేరేపిస్తుందా? ఇది మానవ జాతికి ఎలాంటి ఆశను కలిగిస్తుంది? విజయం సాధించిన సందర్భంలో పాలస్తీనా ప్రజలకు ఏం జరుగుతుంది? రాజ్యం లేని జాతి చివరకు ఒక రాజ్యాన్ని ప్రకటిస్తే, అది ఎలాంటి రాజ్యం అవుతుంది? దాని జెండా కింద ఎలాంటి భయంకర నేరాలు, ఘోరాలు జరుగుతాయి? జాతి, మతంతో నిమిత్తం లేకుండా ప్రతీ ఒక్కరికీ స్వేచ్ఛ, గౌరవం లభించే హక్కుల కోసం మనం పోరాడుతున్న ప్రత్యేక రాజ్యం ఇదేనా? మధ్య ప్రాచ్యంలో పాలస్తీనా ఒకప్పుడు మత రహిత కోట. కానీ ఇప్పుడు హమాస్ మతపరమైన భావజాలాన్ని సమర్థిస్తూ, ఇస్లాం పేరుతో పోరాడుతోంది. "మేము దాని సైనికులం, శత్రువులను దహించే దాని అగ్ని కణాలం" అని హమాస్ మ్యానిఫెస్టో చెప్తుంది. ఆత్మాహుతి బాంబు దాడులు చేసే వారిని ఖండించాలని ప్రపంచానికి పిలుపునిచ్చారు. కానీ వారు ఈ గమ్యానికి చేరుకోవడానికి ముందు వారు ప్రయాణించిన సుదీర్ఘమైన మార్గాన్ని మనం విస్మరించగలమా? 1922 సెప్టెంబర్ 11 నుండి 2002 సెప్టెంబర్ 11 వరకు 80 సంవత్సరాలు యుద్ధం చేయడం అనేది చాలా సుదీర్ఘ కాలం. పాలస్తీనా ప్రజలకు ప్రపంచం ఇవ్వగలిగిన సలహా ఏదైనా ఉందా? వారు గోల్డా మెయిర్ సూచనను స్వీకరించి, వారిని ఉనికిలో లేకుండా చేసే నిజమైన ప్రయత్నం ఏమైనా చెయ్యాలా?

ఇరవై ఒక్క సంవత్సరాల క్రితం నేను న్యూ మెక్సికోలో 'సెప్టెంబర్...రా..' అంటూ ప్రసంగించినప్పుడు, పాలస్తీనా విషయంలో అమెరికాలో ఒక రకమైన నిశ్శబ్దం ఆవరించి ఉంది. దాని గురించి మాట్లాడిన వారు భారీ మూల్యాన్ని చెల్లించారు. నేడు యువకులంతా వీధుల్లో ఉన్నారు. ముందు నుంచి యూదులు, పాలస్తీనియన్లు నాయకత్వం వహిస్తూ, వారి ప్రభుత్వం, అమెరికా ప్రభుత్వం ఏం చేస్తోందని ఆగ్రహిస్తున్నారు. అత్యంత ఉన్నత ప్రాంగణాలతో పాటు విశ్వవిద్యాలయాలు అట్టుడికి పోతున్నాయి. వాటిని మూసేయడానికి పెట్టుబడిదారీ విధానం వేగంగా కదులుతున్నది. దాతలు నిధులను నిలిపివేస్తామని బెదిరిస్తున్నారు. తద్వారా అమెరికా విద్యార్థులు ఏం చెప్పవచ్చు లేదా ఏం చెప్పకూడదు, వారు ఎలా ఆలోచించాలి లేదా ఎలా ఆలోచించకూడదు అనేది నిర్ణయం అవుతుంది. ఉదారవాద విద్య అని పిలువబడే పునాది సూత్రాల ప్రధాన కేంద్రానికి ఇదొక దెబ్బ. వలసానంతర వాదం, బహుళ సాంస్కృతిక వాదం, అంతర్జాతీయ చట్టం, జెనీవా సభలు, మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనల లాంటివి అన్నీ పోయాయి. వాక్ స్వేచ్ఛ లేదా ప్రజా నైతికత లాంటివి పోయాయి. అంతర్జాతీయ చట్టం న్యాయవాదులు, పండితులు చెప్పే "యుద్ధం" జాతి సంహారం అన్ని చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉంది. దీనిలో నేరస్థులు తమను తాము బాధితులుగా చెప్పుకున్నారు. వర్ణ వివక్షత రాజ్యాన్ని నడిపే వలసవాదులు అణచివేతకు గురైన వారుగా చెప్పుకున్నారు.

9/11 తరువాత పౌర హక్కులను విచ్ఛిన్నం చేయడానికి, విస్తృతమైన దురాక్రమణ నిఘా వ్యవస్థను నిర్మాలించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పాలనా వ్యవస్థలకు అమెరికా యుద్ధం రక్షణను ఇచ్చింది. దానిలో మన ప్రభుత్వాలకు మన గురించి ప్రతీది తెలుసు కానీ మనకు వారి గురించి ఏమీ తెలియదు. అదేవిధంగా, అమెరికా నూతన మెకార్థీయిజం గొడుగు కింద ప్రపంచంలో ఉన్న దేశాల్లో ఘోరమైన విషయాలు పెరిగి, అభివృద్ధి చెందుతాయి. మన దేశంలో కొన్ని సంవత్సరాల క్రితమే ప్రారంభమైందనుకోండి. కానీ మనం మాట్లాడకుంటే, అది ఊపందుకుంటుంది, మనల్ని తుడిచి పెడుతుంది. భారతదేశంలోని అగ్రశ్రేణి యూనివర్సిటీలలో ఒకటైన ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రవర్తనా నియమావళిని జారీ చేసింది. నిరాహార దీక్ష లేదా ధర్నాకు దిగిన ఏ విద్యార్థి అయినా రూ.20 వేలు జరిమానా చెల్లించాలి. దేశ వ్యతిరేక నినాదాలు చేస్తే రూ.10 వేలు జరిమానా విధించారు. ఆ నినాదాలు ఏమిటి అనేవి ఇంకా ఆ జాబితాలో లేవు. కానీ ముస్లింల జాతి నిర్మూలన, ముస్లింల జాతి ప్రక్షాళన కోసం ఇచ్చే పిలుపులు దానిలో ఉండవని మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు. కాబట్టి పాలస్తీనాలో యుద్ధం కూడా మనదే. మనం చెప్పవలసింది ఖచ్చితంగా చెప్పాలి, పదే పదే స్పష్టంగా చెప్పాలి.


ఇజ్రాయిల్...వెస్ట్‌బ్యాంక్‌ను ఆక్రమించడం, గాజాను ముట్టడించడం మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాలు. ఆక్రమణకు పెట్టుబడి పెట్టి, మద్దతిచ్చిన అమెరికా, ఇతర దేశాలు కూడా ఆ నేరంలో భాగస్వాములే. ప్రస్తుతం మనం చూస్తున్న ఘోరం, పాలస్తీనా పౌరులను అనాలోచితంగా చంపడం అనేది ఆక్రమణ, ముట్టడిల పర్యవసానంగానే జరిగింది. క్రూరత్వం గురించి చేసే ఎన్ని వ్యాఖ్యానాలైనా, రెండు పక్షాల మితిమీరిన చర్యల ఖండనలైనా గానీ పరిష్కారం చూపవు. ఆక్రమణే రాక్షసత్వాన్ని పెంచుతుంది. ఇది నేరస్తులకు, బాధితులకు ఇరువురికీ హాని కలిగిస్తుంది. బాధితులు చనిపోతారు. నేరస్తులు, తాము చేసిన తప్పును నెత్తిమీద పెట్టుకుని జీవితాంతం మోయాల్సి ఉంటుంది.

పరిష్కారం మిలిటరీ సంబంధమైనది కాదు. ఇజ్రాయిలీలు, పాలస్తీనియన్లు ఇద్దరూ కలిసి గౌరవంగా, సమాన హక్కులతో జీవించాలనేది రాజకీయంగా మాత్రమే ఉంటుంది. ప్రపంచం జోక్యం చేసుకోవాలి. ఆక్రమణ అంతం కావాలి. పాలస్తీనియన్లు మాతృభూమిని కలిగి ఉండాలి. పాలస్తీనా శరణార్థులకు తిరిగి వచ్చే హక్కు ఉండాలి. లేకపోతే, పాశ్చాత్య ఉదారవాద నైతిక నిర్మాణం ఉనికిలో లేకుండా పోతుంది. ఇది ఎప్పుడూ కపటంగానే ఉన్నదనే విషయం మనకు తెలుసు. కానీ ఇది కూడా ఒక విధమైన ఆశ్రయాన్ని సమకూర్చింది. ఆ ఆశ్రయం మన కళ్ళ ముందే కనుమరుగవుతుంది. కాబట్టి దయచేసి పాలస్తీనా, ఇజ్రాయిల్ కోసం, జీవించి ఉన్నవారి కోసం, చనిపోయిన వారి పేరున, ఇజ్రాయిల్ జైల్లో ఉన్న పాలస్తీనియన్లు, హమాస్ చేతిలో బందీలుగా ఉన్న వారి కోసం, మొత్తం మానవాళి కోసం ఈ వధను ఆపండి.

(డిసెంబర్ 13న తిరువనంతపురంలో నిర్వహించబడిన పి.గోవింద పిళ్ళై అవార్డు కార్యక్రమంలో అవార్డు గ్రహీత అరుంధతీ రాయ్ ప్రసంగ పాఠం సంక్షిప్తంగా)

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

ఇజ్రాయిల్... వెస్ట్‌బ్యాంక్‌ను ఆక్రమించడం, గాజాను ముట్టడించడం మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాలు. ఆక్రమణకు పెట్టుబడి పెట్టి, మద్దతిచ్చిన అమెరికా, ఇతర దేశాలు కూడా ఆ నేరంలో భాగస్వాములే. ప్రస్తుతం మనం చూస్తున్న ఘోరం పాలస్తీనా పౌరులను అనాలోచితంగా చంపడం అనేది ఆక్రమణ, ముట్టడిల పర్యవసానంగానే జరిగింది. క్రూరత్వం గురించి చేసే ఎన్ని వ్యాఖ్యానాలైనా, రెండు పక్షాల మితిమీరిన చర్యల ఖండనలైనా గానీ పరిష్కారం చూపవు. ఆక్రమణే రాక్షసత్వాన్ని పెంచుతుంది. ఇది నేరస్తులకు, బాధితులకు ఇరువురికీ హాని కలిగిస్తుంది. బాధితులు చనిపోతారు. నేరస్తులు, తాము చేసిన తప్పును నెత్తి మీద పెట్టుకుని జీవితాంతం మోయాల్సి ఉంటుంది.



ట్రక్ డ్రైవర్ల సమ్మె విరమణ

- హిట్ అండ్ రన్ కేసుపై కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ట్రక్ డ్రైవర్ల ఆందోళన

న్యూఢిల్లీ : హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాద కేసులపై కొత్త చట్టానికి వ్యతిరేకంగా సమ్మెను ట్రక్ డ్రైవర్లు మంగళవారం సాయంత్రం నుంచి విరమించారు. డ్రైవర్లు వ్యతిరేకిస్తున్న కొత్త చట్టం ఇంకా అమల్లోకి రాలేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. డ్రైవర్లతో సంప్రదింపులు జరిపిన తరువాతే కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకుని వస్తామని కేంద్ర హామీ ఇచ్చింది. దీంతో సమ్మెను డ్రైవర్లు విరమించారు. రెండు రోజులగా ట్రక్ డ్రైవర్లు సమ్మె నేపథ్యంలో డ్రైవర్ల ప్రతినిధులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా మంగళవారం సాయత్రం చర్చలు జరిపారు. ఈ చర్చల్లో కేంద్రం తరపున పై హామీ ఇచ్చారు.

కాగా, అంతకు ముందు దేశవ్యాప్తంగా ట్రక్ డ్రైవర్ల ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. ట్రక్ డ్రైవర్ల సమ్మె ప్రభావం ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, హర్యానా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా రాష్ట్రాల్లో కనిపించినా.. దక్షిణాది రాష్ట్రాల్లో కూడా సమ్మె ప్రభావం కనిపించింది.

కొత్త చట్టం ప్రకారం ఈ కేసుల్లో రూ. 7 లక్షల జరిమానా, 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారు. ఈ నిబంధనకు వ్యతిరేకంగా ట్రక్కులు, ట్యాంకర్ల డ్రైవర్లు సోమవారం నుంచి ఆందోళనలకు దిగారు. మంగళవారం కూడా దేశంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లను దిగ్బంధించి ఆందోళనలు జరిపారు. మహారాష్ట్రలోని సోలాపూర్, కోల్హాపూర్, నాగ్‌పూర్, గోండియా జిల్లాలోనూ నవీ ముంబయిలోనూ మంగళవారం ఇవి కొనసాగాయి. రాజస్థాన్‌లోని దోలాపూర్-కరౌలి మార్గం, ఉదయిపూర్-నద్ధవార మార్గం, సావాలి మధోపూర్-కోటా లాల్సోత్ మార్గంలోనూ రోడ్లను ట్రక్ డ్రైవర్లు దిగ్బందించారు. ముంబయి-ఆగ్రా జాతీయ రహదారిపై అనేక ప్రాంతాల్లో డ్రైవర్లను నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, భోపాల్‌నూ ట్రక్కులు స్థంభించిపోయాయి. ట్రక్ డ్రైవర్ల ఆందోళనతో సరకు రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా నిత్యావసర వస్తువులకు కొరత ఏర్పడుతుంది. పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్లు కూడా ఈ సమ్మెలో పాల్గొనడంతో అనేక పెట్రో బ్యాంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో వాహన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


లక్నోలో మంగళవారం ఆందోళన చేస్తున్న ట్రక్కుడ్రైవర్లు

నేడు ఇండియా ఫోరం వర్చువల్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష పార్టీల ఇండియా ఫోరం వర్చువల్ సమావేశం బుధవారం జరగనుంది. జూమ్ మీటింగ్‌లో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే ఫోరంలోని ప్రధాన పార్టీల జాతీయ అధ్యక్షులు ఈ ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో నితీష్ కుమార్ పేరును ఫోరం కన్వీనర్‌గా కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రతిపాదించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. నితీష్‌ను ఫోరం కన్వీనర్‌గా ప్రకటించే విషయంలో ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ అభిప్రాయాలు తీసుకుందని, శరద్ పవార్, ఉద్ధవ్ థాకరేతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిందని తెలుస్తోంది. ఇండియా ఫోరం ఇంత వరకు నాలుగు సార్లు సమావేశమైంది. తొలి సమావేశం పాట్నాలో జూన్ 23న, రెండో సమావేశం బెంగళూరులో జులై 17 - 18న, మూడో సమావేశం ముంబయిలో ఆగస్టు 31-సెప్టెంబరు 1న, నాలుగో సమావేశం ఢిల్లీలో డిసెంబరు 19న జరిగింది.కాగా, పార్లమెంటు ఎన్నికలు ఏప్రిల్-మే నెలల్లో ఉండే అవకాశముంది. పదిహేడవ లోక్‌సభ గడువు జూన్ చివరినాటికి ముగియనున్నది.

బిజెపి నుంచి పోటీ చేయండి

- కేరళ గవర్నర్‌పై బృందాకరత్ విసుర్లు

తిరువనంతపురం : కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తీరుపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన నేరుగా రాజకీయాల్లోకి రావాలనీ, 2024 సాధారణ ఎన్నికల్లో ఆయన బిజెపి నుంచి పోటీ చేయాలని వ్యంగ్యాస్త్రాలు సంధించించారు. గవర్నర్.. రాష్ట్ర ప్రభుత్వంతో పలు అంశాల్లో విభేదిస్తూ సర్కారుపై ఆరోపణలు చేస్తున్న విషయం విదితమే. పెండింగ్ యూనివర్సిటీ బిల్లుల విషయంతో పలు సందర్భాల్లో ఆయన ప్రభుత్వ వ్యవహారాల్లో బిజెపి ప్రతినిధిలా జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గవర్నర్ తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో బృందాకరత్ పై విధంగా స్పందించారు. "గౌరవ గవర్నర్‌కు నేరుగా రాజకీయాల్లో రావాలనే ఆసక్తి ఉంటే రావాలి. షెడ్యూల్ ప్రకారం 2024 లోక్‌సభ ఎన్నికలు రానున్నాయి. ఆయన తన రాజకీయ ఔన్నత్యాన్ని కొలవాలనుకుంటే ఎన్నికల్లో పోటీ చేయాలి. బహుశా, కేరళ గవర్నర్ నేరుగా ఎన్నికల రాజకీయాల్లోకి రావటం మరింత సముచితం. బీజేపీ టికెట్ తీసుకొని కేరళలోని ఏ స్థానం నుంచైనా పోటీ చేయాలి' అని బృందా కారత్ అన్నారు. రోజువారీ బహిరంగ ప్రకటనలు చేస్తూ తన సొంత పదవిని కించపరిచే బదులు, ముఖ్యమంత్రితో ఆయనకున్న విభేదాలను గవర్నర్ తొలగించుకోవాలని సూచించారు.

వివిప్యాట్లపై అభిప్రాయాలకు సమయం ఇవ్వండి

- సిఇసికి జైరాం రమేష్ లేఖ

న్యూఢిల్లీ : వివి ప్యాట్లపై అభిప్రాయాలను తెలియజేయడానికి తనకు, తన సహచరులకు సమయం ఇవ్వాలని కోరుతూ ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) రాజీవ్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ లేఖ రాశారు. గత నెల 20న జరిగిన ఇండియా ఫోరం సమావేశంలో 'వివి ప్యాట్లపై చర్చించి తగిన సూచనలు ఇవ్వడానికి సిఇసి అపాయింట్ తీసుకోవాలి' అని తీర్మానం చేసినట్లు జైరాం రమేష్ లేఖలో తెలిపారు. ఎన్నికల సంఘానికి ఈ తీర్మానం నకలును అందజేసి, చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇప్పటి వరకూ ఫలితం రాలేదని పేర్కొన్నారు. ఇండియా ఫోరానికి చెందిన నలుగురు సభ్యుల బృందానికి సమయం ఇవ్వాలని లేఖలో కోరారు. పదేపదే అభ్యర్థనలు చేసినా.. ఇండియా ఫోరం నేతలకు సమయం ఇవ్వలేదని జైరాం రమేష్ గుర్తు చేశారు.

2023లో 120 మంది జర్నలిస్టుల హత్య

- అంతర్జాతీయ జర్నలిస్టుల ఫెడరేషన్ వెల్లడి

న్యూయార్క్: 2023 సంవత్సరంలో ప్రపంచ వ్యాపితంగా 120 మంది జర్నలిస్టులు హత్యగావించబడ్డారని అంతర్జాతీయ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఐఎఫ్‌జె) వెల్లడించింది. వీరిలో 68 శాతం (75 మంది) ఇజ్రాయిల్ హంతక దాడుల్లో చనిపోయినవారే. ఇందులో 75 మంది పాలస్తీనా జర్నలిస్టులు కాగా, నల్గురు ఇజ్రాయిల్, ముగ్గురు లెబనీయులు ఉన్నారు. 2022లో 68 మంది, 2021లో 47 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. ఐరాస మానవ హక్కుల దినోత్సవమైన డిసెంబరు 10న జాబితా విడుదల జేసిన నాటికి 94 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. గడచిన మూడు వారాల్లో మరో 26 మంది హత్యకు గురయ్యారు. జర్నలిస్టుల భద్రత, స్వతంత్రతను కాపాడాలని ఐరాస చేసిన తీర్మానాలకు అన్ని దేశాల ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని ఐఎఫ్‌జె కోరింది.

బడ్జెట్ సమావేశాలకు 90 శాతం మంది సస్పెండ్ ఎంపిలు

- 31న రాష్ట్రపతి ఉభయ సభల సంయుక్త సమావేశంతో ప్రారంభం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సస్పెండైన 146 మంది ఎంపిల్లో 90 శాతం మంది లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగే చివరి పార్లమెంట్ సమావేశాలకు హాజరు కానున్నారు. మిగిలిన 10 శాతం (14 మంది) పార్లమెంట్ సభ్యులపై సస్పెన్షన్ కొనసాగుతుంది. వారు ప్రత్యేక హక్కుల ఉల్లంఘనను ఎదుర్కొంటున్నందున విచారణలో ఉన్నారు.

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ, రాజ్యసభ రెండూ డిసెంబరు 29న ప్రోరోగ్ చేయబడ్డాయి. దీంతో 132 మంది ఎంపిల సస్పెన్షన్ గడువు ముగిసింది. వారిపై శిక్షార్హమైన చర్య సెషన్‌కు మాత్రమే చెల్లుతుంది. ఇద్దరు చొరబాటుదారులు పొగ డబ్బాలతో లోక్‌సభలోకి దూకడంతో భద్రతా లోపం వెల్లడైంది. పార్లమెంట్ సమావేశాల్లో రెండు సభల నుండి సస్పెండ్ చేయబడిన ప్రతిపక్ష ఎంపిల సంఖ్య (146) పరంగా రికార్డు సృష్టించింది.

31న పార్లమెంట్ బడ్జెట్ భేటీ

జనవరి 31 నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో కుదించబడిన బడ్జెట్ సెషన్ ప్రారంభమవుతుంది. ఓట్ ఆన్ అకౌంట్స్ బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. ఆ తర్వాత రెండు అంశాలపై చర్చ జరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్-మేలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున, కొత్త ప్రభుత్వం జూన్‌లో పూర్తి బడ్జెట్‌ను సమర్పించనుంది.

సిఇసి, ఇసిల నియామకాలకు స్వతంత్ర, పారదర్శక వ్యవస్థ

సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించిన కొత్త చట్టం అమలును నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సిఇసి, ఇసిల నియామకానికి తటస్థ, స్వతంత్ర సెలక్షన్ కమిటీని ఏర్పాటుచేసి స్వతంత్ర, పారదర్శక వ్యవస్థను అమలు చేయాల్సిందిగా పిటిషనర్ గోపాల్ సింగ్ కోరారు. గతేడాది డిసెంబరు 28న జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలును నిలిపివేయాలని ఆ పిటిషన్ కోర్టును కోరింది. సిఇసి, ఇసిలుగా నియమించేందుకు తగిన వ్యక్తులను ఎంపిక చేసేందుకు అత్యున్నత స్థాయి కమిటీ సభ్యునిగా భారత ప్రధాన న్యాయమూర్తిని కూడా చేరుస్తూ 2023 మార్చిలో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొత్త చట్టం పక్కకు నెట్టివేసింది. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధాని నియమించే కేంద్ర కేబినెట్ మంత్రితో కూడిన సెలక్షన్ కమిటీ సిఫార్సుపై రాష్ట్రపతి సిఇసి, ఇసిలను నియమిస్తారని కొత్త చట్టం పేర్కొంటోంది. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన కమిటీ ఇచ్చిన సలహా ప్రాతిపదికన భారత రాష్ట్రపతి ఈ నియామకాలు జరుపుతారని 2023 మార్చి నాటి తీర్పు పేర్కొంటోంది..

న్యాయ సంస్కరణలు రాజ్యాంగ విరుద్ధం

- ఇజ్రాయిలీ సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు
- నెతన్యాహుకు గట్టి ఎదురు దెబ్బ

టెల్‌అవీవ్: న్యాయవ్యవస్థ అధికారాలు, ప్రజాస్వామిక హక్కులను కాలరాసే వివాదాస్పద న్యాయ సంస్కరణలను ఇజ్రాయిల్ అత్యున్నత న్యాయస్థానం కొట్టి పారేసింది. ఇది నెతన్యాహుకు గట్టి ఎదురుదెబ్బ. ఈ సంస్కరణలు రాజ్యాంగ విరుద్ధమని 15 మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీం కోర్టు సంపూర్ణ ధర్మాసనం 8-7 తేడాతో చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఇజ్రాయిల్‌కు మన దేశంలో ఉన్నట్లు లిఖిత పూర్వక రాజ్యాంగం ఏదీ లేదు. ఇజ్రాయిల్ ఏర్పడినప్పటి నుంచి కొన్ని నిర్దిష్టమైన బేసిక్ చట్టాల ఆధారంగా ప్రభుత్వ పాలన సాగుతుంది. న్యాయవ్యవస్థ పీక నులిమేసే ఈ చట్టాన్ని ఇజ్రాయిల్ పార్లమెంటులో సంకుచిత రాజకీయ మెజార్టీ ఆధారంగా నెతన్యాహు ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. ఇది న్యాయవ్యవ్థను బలహీన పరస్తుందని, ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా మారనుందని ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదులు, న్యాయవాదులు దేశవ్యాపితంగా ఆందోళనలు నిర్వహించారు. ఇంతలో గాజాపై నెతన్యాహు దురాక్రమణపూరిత యుద్ధాన్ని ప్రకటించడంతో ఈ అంశం వెనక్కి పోయింది.

ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీం కోర్టు నూతన సంవత్సర ప్రారంభ రోజున తన తీర్పును వెలువరించింది. ప్రభుత్వం చేసే వాదనలకు వ్యతిరేకంగా, అనుకూలంగా న్యాయమూర్తులు అంశాల వారీ వివరణ ఇచ్చారు. శాసనాలు చేసే అధికారం పార్లమెంటుకు వుందనడంలో ఎలాంటి సందేహమూ అక్కర్లేదు. కానీ, పార్లమెంటు చేసే ఏ చట్టమైన రాజ్యాంగ స్పూర్తికి లోబడి ఉండాలి. న్యాయానికి పరిమితులు విధిస్తామంటే కుదరదు. న్యాయవ్యవస్థను శాసించే అధికారం రాజ్యాంగం ప్రకారం కీసెట్ (పార్లమెంటు)కు లేదు. ఈ విషయం గుర్తెరిగి వ్యవహరించాలని సుప్రీం కోర్టు ఆ తీర్పులో స్పష్టం చేసింది,. మందబలం ఉంది కదా అని సంకుచిత రాజకీయ మెజార్టీతో పౌరుల, మైనార్టీల వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను హరిస్తామంటే కుదరదు అని నెతన్యాహుకు సుప్రీం గట్టిగా మొట్టికాయలు వేసింది. నెతన్యాహు తీసుకొచ్చిన ఈ న్యాయ సంస్కరణలు అమలులోకి రావడానికి జనవరి12వతేదీని గడువుగా విధించారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రకటించిన తరువాత నెతన్యాహు నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం నడుస్తోంది. సుప్రీం తీర్పు నేపథ్యంలో న్యాయ వ్యవహారాలకు సంబంధించిన వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకూడదని సంకీర్ణ పభుత్వంలో భాగస్వామ్య పక్షాలు నిర్ణయించాయి.


నెతన్యాహు ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న ప్రజలు (ఫైల్‌ఫోటో)

48కి పెరిగిన భూకంప మృతుల సంఖ్య

- అపార నష్టం జరిగిందన్న ప్రధాని కిషిదా



కనజవా : కొత్త సంవత్సరం ప్రారంభం రోజునే వరుస భూప్రకంపనలతో పెను విషాదాన్ని చవిచూసిన సెంట్రల్ జపాన్‌లో ఇప్పటివరకు 48 మంది మరణించారు. వందలాది భవనాలు, వాహనాలు, బోట్లు ధ్వంసమయ్యాయి. 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపంతో పశ్చిమ తీర ప్రాంతం అతలాకుతలమైంది. మంగళవారం కూడా ప్రకంపనల తీవ్రత కొనసాగుతూనే వుండడంతో ఇళ్లల్లో వుండవద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. భూంకంపం వల్ల సంభవించిన నష్టం అపారంగా వుందని ప్రధాని ఫ్యుమియో కిషిదా హెచ్చరించారు. కొన్ని మారుమూల ప్రాంతాలకు సహాయక బృందాలు వెళ్లడానికి పలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. దీనివల్ల మృతుల సంఖ్య పెరిగే అవకాశం కూడా వుందని ఆందోళన వ్యకం చేశారు. శిధిలాల్లో వున్న వారి ఆచూకీ కోసం అన్వేషించడం, కాపాడడం పెను సవాలుగా మారిందని వ్యాఖ్యానించారు. పైగా భూకంపం ప్రధానంగా సంభవించిన నోటో ద్వీపకల్పంలో ఉత్తర ప్రాంతానికి చేరుకోవడం దుర్లభంగా మారిందని, అక్కడ అనేక అగ్ని ప్రమాదాలు సంభవించడం, తీవ్ర విధ్వంసం చోటుచేసుకోవడంతో పరిస్థితి భయానకంగా వుందని అన్నారు. రహదారులు తీవ్రంగా దెబ్బతినడం, రవాణా సదుపాయాలు లేకపోవడంతో జరిగిన నష్టం ఎంత అనేది అంచనా వేయడం కూడా కష్టమైపోతోందని అధికారులు పేర్కొంటున్నారు. తొలుత జారీ చేసిన సునామీ హెచ్చరికను మంగళవారం ఉదయం అధికారులు ఉపసంహరించుకున్నారు. తీర ప్రాంత పట్టణమైన సుజులో దాదాపు వెయ్యికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని నగర మేయర్ మషురో ఇజుమియా తెలిపారు. పెను విపత్తే ఇదని ఆయన వ్యాఖ్యానించారు. భూంకంపం కారణంగా వేలాది ఇళ్లు అంధకారంలో మగ్గుతున్నాయి. నోటో ద్వీపకల్పంలోని పలు ప్రాంతాల్లో తాగు నీరు కూడా లేకుండా పోయింది. భూకంప వార్త తెలియగానే అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సహా పలు దేశాల నేతలు తమ సంతాప సందేశాలు పంపారు. జపాన్‌కు అవసరమైన సాయం అందించడానికి ముందుకు వచ్చారు.

రన్‌వేపై రెండు విమానాలు ఢీ

- ఐదుగురు మృతి

టోక్యో : టోక్యోలోని హనెడా విమానాశ్రయంలో మంగళవారం ఘోర ప్రమాదం సంభవించింది. జపాన్ కోస్ట్ గార్డ్ విమానంతో పాసింజర్ విమానం ఢీకొనడంతో క్షణాల వ్యవధిలోనే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఈ దుర్ఘటనలో ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. జపాన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన విమానంలో పూర్తిగా మంటలు వ్యాపించడానికి ముందుగానే అందులోని 379మంది ప్రయాణికులు సురక్షితంగా దిగిపోయినట్లు ఎన్‌హెచ్‌కె టివి తెలియజేసింది. జపాన్ కోస్ట్ గార్డ్ విమానం పైలట్ కూడా ఈ ప్రమాదం నుండి తప్పించుకోగలిగారని కోస్ట్ గార్డ్ అధికారులు చెప్పారు. విమానంలోని ఐదుగురు సిబ్బంది చనిపోయినట్లు టివి వార్తలు తెలిపాయి. జపాన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన విమానం రన్‌వే పై వుండగానే పెద్ద ఎత్తున మంటలు, పొగ కమ్ముకోవడం స్థానిక టివి దృశ్యాల్లో కనిపిస్తోంది. విమానం రెక్కకు నిప్పంటుకోవడం, ఒక గంట తర్వాత మొత్తంగా మంటల్లో విమానం చిక్కుకోవడం కనిపిస్తోంది. ప్రమాదానికి గురైన ఎయిర్‌బస్ ఎ-350 షిన్ చిటొసె విమానాశ్రయం నుండి హనెడా విమానాశ్రయానికి ప్రయాణించింది. తమ విమానం ఎంఎ-722తో ప్రయాణికుల విమానం ఢీకొట్టిందని కోస్ట్ గార్డ్ ప్రతినిధి యోషినొరి యాంగ్‌షిమా ధ్రువీకరించారు. కోస్ట్ గార్డ్ విమానం భూకంప బాధితుల కోసం సహాయాన్ని తీసుకుని నైజీరియా వెళ్లాల్సి వుంది. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలోనే వున్న ప్రయాణికుడు స్వీడ్ ఆంటన్ మాట్లాడుతూ, ఢీ కొట్టిన వెంటనే కొద్ది నిముషాల వ్యవధిలో కేబిన్ అంతా పొగ కమ్ముకుపోయిందని, వెంటనే అత్యవసర ద్వారాలు తెరుచుకున్నాయని, తమను కిందకు దింపివేశారని చెప్పారు. అసలేం జరుగుతోందో కొద్ది సేపు అర్థం కాలేదని, అదొక భయంకరమైన అనుభవమని స్వీడ్ వ్యాఖ్యానించారు.

కొత్త సంవత్సరం రోజూ ఆగని ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు

- 24 గంటల్లో 200 మంది మృతి

గాజా : కొత్త సంవత్సరం ప్రారంభ రోజున కూడా గాజాపై ఇజ్రాయిల్ హంతక దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో గడచిన 24గంటల్లో 200మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజా పాత బస్తీలో పెను విధ్వంసం చోటుచేసుకుంది. గ్రేట్ ఒమరి మసీదు, పాత మార్కెట్ వంటి ప్రాంతాలు శిథిలాల దిబ్బలుగా మారాయని ఆ ప్రాంతంలో పర్యటించిన విలేకరి తెలిపారు. ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయిల్ దళాలు తమ దాడులను మరింత తీవ్రతరం చేశాయి. ప్రజలను బలవంతంగా ఇళ్ల నుంచి తరిమేస్తున్నాయి. ఇజ్రాయిల్ చర్య మానవాళికి వ్యతిరేకంగా చేపట్టిన మహా నేరమని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అధికారి ఫ్రాన్సెస్కా అల్బనీస్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ శవాగారాల్లో 450మంది పాలస్తీనియన్ల మృతదేహాలు పడివున్నాయని, వాటిని ఇజ్రాయిల్ ఇవ్వకుండా వేధిస్తోందని మానవ హక్కుల గ్రూపులు విమర్శిస్తున్నాయి. ఇజ్రాయిల్ నిర్బంధంలో వుంటూ మరణించిన 18 మంది ఖైదీలు, 21మంది చిన్నారుల మృతదేహాలు కూడా వున్నాయి.



సుధా భరద్వాజ్ మానవహక్కుల న్యాయవాది, క్రియాశీల సామాజిక కార్యకర్త. 2018 ఆగస్టు 28 తేదీన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నిర్బంధించబడి, మూడేళ్ళ మూడు నెలలు జైలు జీవితం గడిపారు. భీమా కొరేగావ్ కేసులో నిర్బంధించిన 16 మందిలో ఆమె ఒకరు. 62 సంవత్సరాల ఈ మహిళ, తాను తప్పకుండా నింద నుంచి బయటపడగలనని నమ్మకంగా ఉన్నారు. బెయిలుపై వెలుపలికి వచ్చిన తరువాత, 'ఫాంసి యార్డ్ నుంచి' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఒక కార్మిక సంఘ కార్యకర్తగా, పోలీసుల అణచివేతను దగ్గరి నుంచి పరిశీలించారు. ముంబైలోని ఆమె నివాసంలో, ఫ్రంట్ లైన్ ప్రతినిధితో మాట్లాడారు. ఆ ఇంటర్వ్యూ సంక్షిప్త రూపం ఇది.

సంకెళ్లల్లో ప్రజాస్వామ్యం..


మీరు మీ పుస్తకాన్ని 'అన్యాయంగా బంధించబడిన వారికి' అంకితం ఇచ్చారు. మీ జైలు జీవితం న్యాయం పట్ల మీ అభిప్రాయాన్ని ఎలా మార్చింది? లేదా ఎలా ప్రభావితం చేసింది?

నేను జైలులో ఎదుర్కొన్న సమస్యలేవీ నాకు తెలియనివి కావు. పేద ప్రజలు ఎల్లప్పుడూ కాఠిన్యాన్ని ఎదుర్కొంటుంటారు. అణగారిన ప్రజలకు కోర్టుల సానుభూతి ఉండదు. ప్రభుత్వాలు అందచేసే న్యాయసహాయం కూడా అంతంతమాత్రంగానే ఉంటుంది.

జైలులో ఉన్నవారిలో ఎక్కువశాతం మహిళలు, అత్యంత పేద గ్రామీణ మహిళలు. వారికెంత అన్యాయం జరిగినా కోర్టుకెళ్లి పరిష్కరించుకోవాలన్న ఆలోచన కూడా రాదు. అదొక ప్రత్యామ్నాయంగా చూడరు. ఏడేళ్ల శిక్ష తరువాత జైలు లోపల వ్యవసాయ పనులకు అనుమతినిస్తారు. అలా పనికి వెళ్లినందుకుగాను శిక్షలో మినహాయింపులుంటాయి అందువల్ల వారు క్రమం తప్పకుండా పనులకు వెళుతుంటారు. ఎండలో, వానలో, చలిలో కూడా. చివరికి వారి భరోసా వారి శ్రమే. బయట ప్రపంచంలోని వారి జీవితాలలోలాగే, ఇక్కడ కూడా వారు ఆధారపడగలిగేది వారి మీదే. అదే నన్ను మరింతగా కలచివేసింది.

'కార్మిక సంఘాల్లో పనిచేయాలంటే నిబద్ధత తప్పనిసరి' అని మీరంటారు. మీరెందుకు కార్మికసంఘంలో పనిచేయాలని నిర్ణయించుకున్నారు? ప్రఖ్యాత కార్మిక సంఘ నాయకుడు శంకర్ గుహ మిమ్మల్ని ప్రభావితం చేశారా?

నేను కార్మిక సంఘాల్లో పనిచేయడానికి ప్రధానమైన రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది మానసిక కారణం, రెండోది తాత్విక కారణం. అయితే, రెండో కారణమే ప్రధానమైనది. నియోగి నేను నా నిర్ణయాలను ఎలా అమలుచేయాలో దారి చూపారు. చత్తీస్‌ఘర్‌లో ఆయన నడిపే చత్తీస్‌ఘర్ ముక్తి మోర్చా, కేవలం ఒక ఆర్థిక హక్కులను మాత్రమే సాధించిపెట్టే సంఘం కాదు. అనేక రకాల పనులు చేసేది. మౌలికంగా పేదప్రజలు తమ గుర్తింపును సాధించుకోడానికి పనిచేసింది. జీవితంలో ఏదో ఒకటి సాధించుకోవాలని, ఉన్నతమైన గమ్యం కలిగి ఉండాలని నాలాంటి మధ్య తరగతి నుంచి వచ్చినవారికి చిన్నతనం నుంచి నూరిపోస్తుంటారు. కానీ, కార్మికవర్గంలోని పిల్లలకి ఇటువంటి వ్యక్తిగత గుర్తింపులు ఏవీ ఉండవన్న విషయం మనం విస్మరిస్తాం. 'మీకంటూ ఒక సంఘం లేనంతవరకు మీకు ఏ రకమైన గుర్తింపూ ఉండదు అని వారి నమ్మకం'. సమూహంలో ఉండాలనే ఆ భావన కీలకమైనది.



శక్తివంతమైన శత్రువులను తయారు చేసుకున్నందుకు మీకెప్పుడూ భయం వేయలేదా ?

ఈ కార్పొరేట్ సంస్థల్లో పనిచేసేవారు నా సహచరులను కలవడానికి మా ఆఫీస్‌కి వచ్చేవారు. మేము పెట్టిన కేసులను వెనక్కి తీసుకోమని బెదిరించేవారు, భయపెట్టేవారు. నేను మాత్రం ప్రత్యక్షంగా అటువంటి అనుభవాన్ని ఎదుర్కోలేదు. అటువంటి బెదిరింపులను నేను మానవ హక్కుల సంఘం కార్యదర్శిని (పియుసిఎల్) అయిన తరువాతే ఎదుర్కొన్నాను. నా ఫోన్ టాప్ చేయబడేది. స్థానిక ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసేవారు వచ్చి "ఈ కేసులో ఏం జరుగుతున్నది? మీరేమైనా సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారా?" వంటి ప్రశ్నలు వేసేవారు. నేను వాళ్లందరితో అన్ని విషయాలూ పంచుకునే దానిని. ఎవరికీ భయపడలేదు. బహుశా నేను ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉండడం వల్ల కావొచ్చు.

మీరు చత్తీస్‌ఘర్‌ని మీ ఇల్లని చెప్పుకుంటుంటారు. కానీ, అక్కడికి వెళ్లి చాల రోజులయింది. ఈ ప్రభావం మీ మనసుపై ఎంతవరకు పడింది ?

నిజం చెప్పాలంటే– నేను ఇప్పుడు బహిష్కృతురాలిని అయినట్టు భావిస్తున్నాను. నేను చత్తీస్‌ఘర్‌లో 1986 నుంచి 2016 వరకు ఉన్నాను. దాదాపు 30 ఏళ్ళు... నా జీవితంలో ఎక్కువ భాగం అక్కడే గడిచింది. చత్తీస్‌ఘర్ ముక్తి మోర్చా నా ఇల్లు. అక్కడ ఉన్న కార్యకర్తలంతా నా వాళ్లే. అందుకనే 'నువ్వు చిన్న ఖైదు నుంచి పెద్ద ఖైదుకు వచ్చావని' హాస్యమాడుతుంటారు. మళ్ళీ అక్కడికి వెళ్లే రోజు కోసం ఎదురు చూస్తున్నాను.

కార్మికుల మనసులను జయించగలిగితే, వాళ్ళు మిమ్ములను నమ్ముతారని మీరంటారు. జైలులో కూడా మీ అనుభవం ఇదేనా ?

అవును. నూటికి నూరుశాతం ఇదే. నేను బైకుల్లా జైలుకి వెళ్ళినప్పుడు అక్కడి నేరస్థులు తమకు సహాయం చేయమని అడిగేవారు. నేను వారిని తమ ఛార్జ్‌షీట్‌లు చూపించమని అడిగేదానిని. మొదట్లో వారు కొంత అనుమానించేవారు. అది సహజమే కదా! జైలులో స్నేహాలు ఉంటాయి, కానీ క్రూరత్వం, పోసుకోలు కబుర్లు ఎక్కువ. అందువల్ల అక్కడున్నవారు తమ ఛార్జ్‌షీట్లను దాచుకుంటుంటారు. కానీ, నేను వారి ఛార్జ్‌షీట్ల గురించి ఎవరితోనూ చెప్పనని, చర్చించనని, ఆట పట్టించనని నమ్మకం కుదిరిన తరువాత నా దగ్గరికి రావడానికి వరుసలలో నిలుచున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు నేను దరఖాస్తులు, న్యాయవాదులకు, కోర్టులకు ఉత్తరాలు రాస్తునే ఉండేదానిని.


'కోర్టులు, నేరస్తులను పితస్వామ్య భావజాలంలోనుంచి చూసి తీర్పులిస్తాయని' మీరన్నారు. ఆ వ్యవస్థని ఏమేరకు సంస్కరించాల్సిన అవసరం ఉంది?

ఈ మధ్యనే సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి, డి వై చంద్ర చూడ్, లింగ వివక్ష మీద ఒక చిన్న పుస్తకాన్ని వెలువరించిన సందర్భంలో, 'న్యాయాధీశులేమీ ఆకాశం నుంచి ఊడిపడరు. వారూ సమాజం నుంచే వస్తారు. పితృస్వామ్య వ్యవస్థలో ఉన్నందువల్ల, అది కూడా ఉన్నత మెజారిటీ కులాల నుంచి వచ్చినందువల్ల, నేరాలను, నేరస్థులను వారు చూసే చూపులో తేడా ఉంటుందని' అన్నందుకు, క్రమంగా వైవిధ్యాన్ని అంగీకరిస్తునందుకు నేను సంతోషిస్తున్నాను. మరోవైపు చూస్తే మనం ఈ బాధితులకు మరింత సమర్ధవంతంగా రక్షణ అందించాల్సిన అవసరం ఉంది .

నిజానికి బార్‌కి బెంచ్‌కి మధ్య జరిగే సంవాదం వల్ల చట్టాలు ఏర్పడతాయి. కేవలం బెంచ్‌ల వల్ల కాదు. బార్ కూడా శక్తి వంతంగా చర్చించాలి. అది అన్ని పార్శ్వాలను ప్రతిబింబించగలగాలి. అప్పుడే మంచి తీర్పులను న్యాయాధీశులు వెలువడించగలుగుతారు. మనం మన న్యాయ సహాయ వ్యవస్థ ద్వారా సరైన న్యాయం అందించే న్యాయవాదులను పెంచుకోవాలి. అప్పుడే, పేదలకు, అణగారిన తరగతులకు మెరుగైన రక్షణ కల్పించడానికి అవకాశాలు ఉంటాయి.

ఈ పుస్తకంలోని మీ కథనాల్లో కులం, వర్గం, కులపెద్దల పెత్తనం ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఉన్నత వర్గాల మహిళలు మానవత్వంతో ఉన్నట్టు చిత్రీకరించబడతారు. దళితులూ, ఇతర వెనుకబడిన తరగతులలోని వారు శుభ్రపరిచే పనులకి వినియోగించబడినట్టు చెప్తుంటారు. ఈ పరిస్థితి మారే అవకాశాలు ఏమైనా ఉన్నాయా?

ఇప్పుడిప్పుడే కదలిక మొదలైనట్టు అనిపిస్తోంది. వేగంగా మార్పు తీసుకురావాలని చేసిన మండల్ సిఫారసులు, దళితుల దఢ వ్యక్తీకరణలు తీవ్రమైన ప్రతి చర్యలను ఎదుర్కొన్నాయి. దఢ వ్యక్తీకరణలు పెరగగానే హింస పెరిగింది. ఇప్పుడు కుల గణనం బయట పడగానే, ఇప్పటివరకు కనిపించకుండా తెరవెనక దాచి ఉంచింది స్పష్టంగా కనిపించడం మొదలయింది. వీటన్నిటి ప్రభావం భవిష్యత్తులో తప్పనిసరిగా ఉంటుంది. కొన్ని ప్రభావాలు నెమ్మదిగా ఉంటే, కొన్ని తీవ్రంగా ఉంటాయి.



జైలులో మతవివక్ష కనిపిస్తుందా ?

కనిపిస్తుంది. ఇది రెండు విరుద్ధ రీతుల్లో కనిపిస్తుంది. జైలులో మైనారిటీ మతస్థులు ఎక్కువగా ఉంటారు. బయట రెండు మతాల మధ్య ఉన్న నిష్పత్తికన్నా చాలా ఎక్కువ ఉంటుంది. వారంతా ఐక్యంగా ఉంటారు. తమ హక్కులను కాపాడుకుంటుంటారు. ఉదాహరణకి జైలులో – బహుశా బ్రిటిష్ కాలం నాటి నుంచి అలవాటుగా ఉండి ఉంటుంది – రోజా లాంటివి పాటిస్తారు. అందుకు కావలసిన ఏర్పాట్లు చేస్తారు. ఆ రోజుల్లో వంటలు తొందరగా చేస్తారు, సెహ్రి పంపకాలు చేస్తారు. ఆ తరువాత మళ్లీ గదుల్లో బంధిస్తారు. ఈ వెసులుబాటు వల్ల ముస్లిములు కానివారు కూడా ఎంతమంది రోజా చేస్తారో తెలుసుకుంటే మీరు ఆశ్చర్యపోతారు. అయితే ముస్లిములు కూడా గణపతి పూజలో పాల్గొంటారు. అందరూ క్రిస్మస్‌లో పాల్గొంటారు. అందరూ సంతోషంగా ఈ సందర్భాల్లో కలుసుకుంటారు. స్నేహభావంతో మెలుగుతారు. తమను జైలు నుంచి బయటికి పంపించే ఏ దేముడినైనా ప్రజలు కొలవడానికి సిద్ధపడతారు.

చాల సందర్భాల్లో మహిళలు జైలులో ఉండడానికి కారణం మగవారు చేసిన నేరాలే అని మీరన్నారు. వివరిస్తారా?


జైలులో చాలామంది మహిళలు 'చట్టబద్ధంగా ఉన్న బందీలు' అని నేనంటాను. వ్యవస్థ వారిని బంధించి ఉంచింది– వారి భర్తలు, స్నేహితులు, కొడుకులు పారిపోవడం వల్ల. నేరంలో వారి వంతు పాత్ర నామమాత్రంగా ఉంటుంది. కొన్నిసార్లయితే, ఇటువంటి నేరం జరిగిందని కూడా వారికి తెలియదు. ఇటువంటి వారినందరిని జైలులో పెట్టి ప్రయోజనం లేదు. కానీ నేరం తీవ్రత దష్ట్యా వారికి బెయిలు కూడా రాదు. మహిళలను జైలులో పెట్టడమంటే వారి పిల్లలను కూడా బంధించటమే!

మీరు జైలులో మూడేళ్ళ గడిపిన తరువాత బయటికి వచ్చి చూసిన భారతదేశం ఏ మేరకు మారింది?

నేను బయటికి వచ్చాను గాని, ఇతర రాష్ట్రంలో బయట ఉన్నాను. మేము జైలులో ఉండగా అనేక సంఘటనలు జరిగాయి. మోడీ ప్రభుత్వం రెండోసారి ఎన్నికై అధికారం చేపట్టింది. కొత్త శ్రామిక చట్టాలు అమలయ్యాయి. పాతవాటిని రద్దు చేయడం జరిగింది. సమాజం మరింతగా మత ప్రాతిపదికన కేంద్రీకతమైంది. మరింతగా కుంచించుకు పోయింది. ప్రజాస్వామిక స్థానం కుంచించుకు పోయింది–విశ్వవిద్యాలయాల్లో అయినా, మీడియాలో అయినా. నేను చత్తీస్‌ఘర్ వెళ్ళడానికి వీలు లేదు. నాకు చిరపరిచితమైన నా రాష్ట్రానికి వెళ్లగలిగి ఉంటే, అసలైన మార్పులు ఏ మేరకు జరిగాయో చెప్పగలిగి ఉండేదానిని.

('ఫ్రమ్ ఫాంసి యార్డ్ ' పుస్తకాన్ని 'ఉరి వార్డు నుంచి'గా కె.ఉషారాణి తెలుగు అనువాదం చేశారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించింది. ఈ పుస్తకావిష్కరణ 4.1.2024వ తేదీన విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో జరుగుతుంది.)

రంగవల్లి





చుండూరు తన్మయి,
హైద్రాబాద్.

16 చుక్కలు 8 వరుసలు
8 వచ్చేవరకు (సరిచుక్క)

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

ఆన్‌లైన్ ద్వారా ఉత్తమ కోర్సులు

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ప్రపంచంలో ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో ఉన్న మంచి కోర్సులను ఆన్‌లైన్ ద్వారా తీసుకురానున్నామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌తో స్టైఫండ్ ఇస్తున్నట్లు తెలిపారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి రూపొందించిన కెరీర్ టూల్ కిట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా తీసుకురానున్న రెండు వేల కోర్సులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా స్టైఫండ్ అందించేలా కొన్ని కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి టూల్ కిట్ గురించి వివరించారు. విద్యార్థి కోణంలో ఆలోచించి వారి భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా టూల్ కిట్‌ను తయారుచేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్లు కె రామ్మోహన్‌రావు, ఉమామహేశ్వరి, కార్యదర్శి నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎంపి రఘురామ పిల్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి–అమరావతి

సంక్షేమ పథకాల అమలు పేరుతో అక్రమాలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ నర్సాపురం ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిల్‌పై విచారణ ఈ నెల 23కు వాయిదా పడింది. ఆ పథకాల వల్ల పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని పిటిషనర్ అభియోగం. ఈ పిల్‌కు విచారణార్హత వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని 41 మంది ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. వకాలత్ కూడా దాఖలు చేయాలంది. ఈ మేరకు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కౌంటర్ దాఖలు చేశారని అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ చెప్పారు. సిఎస్ కౌంటర్‌నే ఇతర అధికారులు కూడా దాఖలు చేసినట్లుగా పరిగణించాలని, దానినే కౌంటర్‌గా అన్వయింప జేసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆ కౌంటర్లకు సమాధానం ఇవ్వాలని పిటిషనరును హైకోర్టు ఆదేశించింది.

6.47 లక్షల మందికి వైకుంఠ దర్శనం

- టిటిడి ఇఒ ధర్మారెడ్డి

ప్రజాశక్తి – తిరుమల

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 2023, డిసెంబరు 23 నుంచి 2024, జనవరి ఒకటి వరకు పది రోజుల పాటు 6.47 లక్షల మంది యాత్రికులకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించామని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. 7,76,930 టికెట్లు, టోకెన్లు జారీ చేశామని, దాదాపు లక్ష మంది పది రోజుల్లో గైర్హాజరయ్యారని చెప్పారు. వచ్చే ఏడాది గైర్హాజరును తగ్గించేందుకు ప్రయత్నిస్తామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఇఒ మీడియా సమావేశం నిర్వహించారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా వైకుంఠ ద్వార దర్శనం కల్పించామన్నారు. చలికి ఎక్కువ సమయం వేచి ఉండకుండా టైంస్లాట్ టోకెన్లు జారీ చేశామని తెలిపారు. పది రోజులకు కలిపి విఐపి బ్రేక్ దర్శనానికి సంబంధించి మొత్తం 19,255 టికెట్లు జారీ చేశామని, 18,578 మంది హాజరుకాగా, 677 మంది (3.3 శాతం) గైర్హాజరయ్యారని చెప్పారు.

దాతలకు బ్రేక్ దర్శనానికి సంబంధించి ఆన్‌లైన్‌లో మొత్తం 6,858 టికెట్లు బుక్ చేసుకున్నారని, 6,388 మంది హాజరుకాగా, 470 మంది (7 శాతం) గైర్హాజరయ్యారని వివరించారు. పది రోజులకు కలిపి రూ.40.20 కోట్లు హుండీ కానుకలు అందాయని, 17.81 లక్షల మంది అన్నప్రసాదాలు, 35.60 లక్షల మంది లడ్డూ ప్రసాదాలు స్వీకరించారని, 2.14 లక్షల మంది యాత్రికులు తలనీలాలు సమర్పించారని తెలిపారు. అలిపిరి పాదాల మండపం వద్ద రాతిమండపం కూలిపోయే స్థితికి చేరుకుందన్నారు. అలిపిరి నడకమార్గంలో ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాల ద్వారా చిరుత, ఎలుగుబంటి సంచారాన్ని గుర్తించినపుడు వెంటనే యాత్రికులను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్ర అటవీశాఖకు రూ.3.5 కోట్లు అందించామని, దీంతో అత్యాధునిక ట్రాప్ కెమెరాల కొనుగోలుతో పాటు ఇతర చర్యలు చేపడతారని చెప్పారు. మీడియా సమావేశంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విజిఒ నందకిషోర్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

12న 'అయలాన్'



శివకార్తికేయన్ హీరోగా రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'అయలాన్'. ఆర్ రవి కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం ఏలియన్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందింది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించింది. తెలుగు, తమిళ భాషలో విడుదల చేస్తున్న ఈ చిత్రం జనవరి 12 విడుదలచేస్తున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించగా కే జె ఆర్ స్టూడియోస్ నిర్మాణం వహించారు.



గుంటూరుకారంలో కృష్ణ డైలాగులు

హీరోగా మహేష్‌బాబు, హీరోయిన్లుగా శ్రీలీల, మీనాక్షి చౌదరి నటించిన చిత్రం గుంటూరుకారం. సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే. తండ్రి కృష్ణ సినిమాల్లోని డైలాగులను ఈ సినిమాలో మహేష్ ప్రస్తావించినట్లుగా సమాచారం. కృష్ణ చనిపోయిన తర్వాత వస్తున్న మొదటి చిత్రం ఇదే. అందుకే ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్‌లను ఇచ్చేలా దర్శకుడు త్రివిక్రమ్ ప్లాన్ చేసినట్లుగా సమాచారం. ఒక పాపులర్ డైలాగ్‌ను మహేష్‌బాబు చేత ఫైటింగ్ సన్నివేశంలో చెప్పించారని తెలుస్తోంది. హిట్ బిట్ 'సాంగ్' కూడా ఉందని సమాచారం.

ఓటీటీలో తమన్నా 'దటీజ్ మహాలక్ష్మి'!



తమన్నా నటించిన 'దటీజ్ మహాలక్ష్మి' చిత్రం 8 ఏళ్ల తరువాత విడుదలకు సిద్ధమవుతోంది. అయితే థియేటర్లో కాకుండా, నేరుగా ఓటీటీలో రిలీజ్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రానికి ప్రశాంత వర్మ దర్శకత్వం వహించారు. కంగన రనౌత్ నటించిన 'క్వీన్' ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నట్లు 2014లో ప్రకటించారు. 2016లోనే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సౌత్ రీమేక్ రైట్స్ విషయంలో నెలకొన్న వివాదం కారణంగా రిలీజ్ కాలేదు. తాజా సమాచారం ప్రకారం ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌తో నిర్మాతలు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో కనిపించనున్నారు.

వన్డేల్లో వైట్‌వాష్

- మూడో వన్డేలోనూ భారత మహిళల ఘోర పరాజయం
- లిచ్‌ఫీల్డ్ సెంచరీ
- సిరీస్ 3–0తో ఆస్ట్రేలియా కైవసం



ముంబయి: ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియా ఓడి వైట్‌వాష్‌కు గురైంది. తొలి రెండు వన్డేలను ఓడి 2–0తో సిరీస్‌ను ఇప్పటికే చేజార్చుకున్న టీమిండి యా.. మంగళవారం జరిగిన ఆఖరి వన్డేలో ఏకంగా 190పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవి చూసింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 338పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో హర్మన్‌ప్రీత్ సేన 32.4ఓవర్లలో 148పరుగులకే కుప్పకూలింది. తొలుత ఆస్ట్రేలియా యువ ఓపెనర్ ఫోబె లిచ్‌ఫీల్డ్ (119; 125బంతుల్లో 16ఫోర్లు, సిక్సర్), కెప్టెన్ అలిస్సా హీలి (82; 85 బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు) తొలి వికెట్‌కు 28.5 ఓవర్లలో 189 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా ఈ ఇద్దరూ వికెట్ కోల్పోలేదు. భారీ భాగస్వామ్యం తర్వాత ఈ జోడీని ఎట్టకేలకు పూజా వస్త్రాకర్ విడదీసింది. ఆ తర్వాత వచ్చిన ఎలీస్ పెర్రీ(16), బెత్ మూనీ(3), తహిలా మెక్‌గ్రాత్(0)లు విఫలమయ్యారు. ఈ సిరీస్‌లో ఇదివరకే రెండు అర్ధ సెంచరీలు చేసిన లిచ్‌ఫీల్డ్.. ఈ మ్యాచ్‌లో 109 బంతుల్లో సెంచరీ పూర్తిచేసింది. వన్డేలలో ఆమెకు ఇది రెండో శతకం. దీప్తి శర్మ ఆమెను పెవిలియన్‌కు పంపింది. ఆఖర్లో అన్నాబెల్ సదర్లాండ్(23), అలానా కింగ్(26నాటౌట్; 14బంతుల్లో ఫోర్, 3సిక్సర్లు) ధాటిగా ఆడటంతో ఆసీస్ 330కు పైగా పరుగులు చేసింది. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్‌కు మూడు, అమన్‌జ్యోత్ కౌర్ రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో టీమిండియా బ్యాటర్లు ఒక్కరూ క్రీజ్‌లో నిలదొక్కుకోలేదు. ఓపెనర్ స్మృతి మంధాన(29)కి తోడు రోడ్రిగ్స్(25), దీప్తి శర్మ(25నాటౌట్) కాస్త ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(3) మరోసారి స్వల్పస్కోర్‌కే పెవీలియన్‌కు చేరింది. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఎక్కువసేపు క్రీజ్‌లో నిలదొక్కుకోలేకపోయారు. ఆస్ట్రేలియా బౌలర్లు వారేహామ్‌కు మూడు, స్కట్, కింగ్, సథర్లాండ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ లిచ్‌ఫీల్డ్‌కు లభించింది. దీంతో ఆస్ట్రేలియా జట్టు 3–0తో వన్డే సిరీస్‌ను చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: లిచ్‌ఫీల్డ్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)దీప్తి శర్మ 119, అలీసా హీలీ (బి)పూజ వస్త్రాకర్ 82, ఎలీసా పెర్రి (ఎల్‌బి)అమన్‌జ్యోత్ కౌర్ 16, బెత్ మూనీ (ఎల్‌బి)శ్రేయాంక పాటిల్ 3, తహిల మెక్‌గ్రాత్ (ఎల్‌బి)శ్రేయాంక 0, గార్డినర్ (బి)శ్రేయాంక పాటిల్ 30, సథర్లాండ్ (సి)హర్మన్‌ప్రీత్ కౌర్ (బి)అమన్‌జ్యోత్ కౌర్ 23, వరేహామ్ (నాటౌట్) 11, కింగ్ (నాటౌట్) 26, అదనం 28. (50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 338పరుగులు. **వికెట్ల పతనం:** 1/189, 2/209, 3/216, 4/216, 5/256, 6/295, 7/299 **బౌలింగ్:** రేణుకా సింగ్ 7–0–52–0, పూజ వస్త్రాకర్ 10–0–68–1, శ్రేయాంక పాటిల్ 10–0–57–3, మన్నత్ కశ్యప్ 3–0–30–0, దీప్తి శర్మ 10–0–53–1, అమన్‌జ్యోత్ కౌర్ 10–0–70–2.

భారత మహిళల ఇన్నింగ్స్: యాస్టికా భాటియా (బి)స్కట్ 6, మంధాన (సి)గ్రాత్ (బి)స్కట్ 29, రీచా ఘోష్ (సి)వారేహామ్ 19, హర్మన్‌ప్రీత్ (సి)మూనీ (బి)వారేహామ్ 3, రోడ్రిగ్స్ (సి)కింగ్ (బి)గార్డినర్ 25, దీప్తి శర్మ (నాటౌట్) 25, అమన్‌జ్యోత్ కౌర్ (సి)లిచ్‌ఫీల్డ్ (బి)కింగ్ 3, పూజ వస్త్రాకర్ (బి)కింగ్ 14, శ్రేయాంక పాటిల్ (సి)మెక్‌గ్రాత్ (బి)సథర్లాండ్ 2, రేణుక సింగ్ (సి)హీలీ (బి)సథర్లాండ్ 0, మన్నత్ కశ్యప్ (సి)మూనీ (బి)వారేహామ్ 8, అదనం 14. (32.4ఓవర్లలో ఆలౌట్) 148పరుగులు. **వికెట్ల పతనం:** 1/32, 2/43, 3/57, 4/72, 5/98, 6/102, 7/128, 8/135, 9/135, 10/148 **బౌలింగ్:** స్కట్ 6–1–23–2, గ్రాత్ 5–0–33–0, వారేహామ్ 6.4–0–23–3, గార్డినర్ 7–0–38–1, కింగ్ 5–0–21–2, సథర్లాండ్ 3–0–9–2.

బ్యాటర్లపైనే భారం..

- నేటినుంచి దక్షిణాఫ్రికాతో చివరి టెస్ట్
- మ.2.00గం॥ల నుంచి



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో గెలిచి, సిరీస్‌ను డ్రా చేయాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. వన్డే, టి20 సిరీస్‌లను నెగ్గిన టీమిండియా రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో 0–1తో వెనుకబడి ఉంది. టెస్ట్ సిరీస్ చేజార్చుకోకుండా ఉండాలంటే నేటినుంచి దక్షిణాఫ్రికాతో జరిగే రెండో, చివరి టెస్ట్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. దీంతో సోమవారం కోహ్లి, శ్రేయస్ అయ్యర్ నెట్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చారు. తొలి టెస్టు అరంగేట్రంలో ఏడు వికెట్లతో సత్తాచాటిన సఫారీ ఎడమ చేతి వాటం పేసర్ బర్గర్‌కు కళ్లెం వేయడంపై కోహ్లి దృష్టి సారించాడు. అందుకే ఓ నెట్ బౌలర్ బౌలింగ్‌లో ప్రత్యేకంగా సాధన చేశాడు. భారత బృందంలో ఎడమ చేతి వాటం పేసర్ లేకపోవడంతో అక్కడి నెట్ బౌలర్‌తో కోహ్లి బంతులు వేయించుకున్నాడు. అయితే బర్గర్ వేసే దాని కంటే తక్కువ వేగంతో వచ్చిన ఈ బంతులను కోహ్లి బాగానే ఎదుర్కొన్నాడు. కానీ మ్యాచ్ పరిస్థితుల్లో బర్గర్‌ను ఎలా నిలువరిస్తాడో చూడాలి. బుమ్రా, సిరాజ్, అశ్విన్, అవేశ్ బౌలింగ్‌లోనూ కోహ్లి బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. మరోవైపు షార్ట్ పిచ్ బంతులకు ఔటయ్యే బలహీనతను అధిగమించేందుకు శ్రేయస్ కసరత్తులు చేస్తున్నాడు. త్రోడౌన్ సిబ్బందితో బౌన్సర్లు వచ్చేలా 18 గజాల దూరం నుంచే బంతిని త్రో చేయించుకుని బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. శనివారం బ్యాటింగ్ చేస్తూ గాయపడ్డ శార్దూల్ కోలుకున్నాడు. ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 32పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

భారత్: రోహిత్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, కోహ్లి, శ్రేయస్, కెఎల్ రాహుల్(వికెట్ కీపర్), శార్దూల్/జడేజా, బుమ్రా, సిరాజ్, ఆవేశ్‌ఖాన్, ప్రసిధ్

దక్షిణాఫ్రికా: ఎల్గర్(కెప్టెన్), మార్క్రమ్, జోర్జి, పేటర్సన్, బడింగ్హామ్, వెర్రెయనె, జెన్సన్, మహరాజ్, రబడా, బర్గర్, ఎన్గిడి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68